స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

బుధవారం | 28.05.2025 | సంపుటి : 2 | సంచిక :116 | పేజీలు : 8 | వెల : 2/-



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575


## తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి

- నైరుతికి తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం
- పలు జిల్లాల్లో జోరు వానలు
- వేములవాడ జలమయం
- హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన



నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణ లోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా రేపు, ఎల్లుండి తెలంగా ణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగా లులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



# రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

## భూభారతి పేద రైతులకు చుట్టం

### ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి

- జూన్ 3 నుంచి 20 వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు
- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం
- అధికారులు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలి
- ఎరువులు, విత్తనాల కొరత రానివ్వం.. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్ట్
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గతంలో కంటే 22 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడి

హైదరాబాద్, మే 27 : భూభారతి పేద రైతులకు చుట్టమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు వర్షాల వల్ల ధాన్యం విక్రయం లో కొందరు రైతులకు ఇబ్బందులు తలెత్తాయని.. వారికి అండగా నిలవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం పంటకు వ్యవసాయ శాఖ సన్న ద్ధతపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.


మిగతా 2 లో

సిందూర రేఖ ఎంత ముఖ్యమో
## ప్రపంచానికి తెలిసింది
కేంద్రహోం మంత్రి అమిత్‌షా



06

ఐపీఎల్ ఫైనల్‌లో
## 'సిందూర్' స్పెషల్..
రియల్ హీరోస్‌కు బీసీసీఐ ఆహ్వానం




07

# ఉగ్రవాద ముల్లును ఏరిపడేస్తాం

- 1947లో దేశాన్ని ముక్కలు చేసిన దగ్గర నుంచి పాక్‌ది ఉగ్రబాటే
- పివోకే స్వాధీనంలో పటేల్ మాటలను లక్ష్యపెట్టని పాలకులు
- గుజరాత్ పర్యటనలో దేశభక్తి కనిపించింది
- ఇది భారత్ ప్రజల హృదయాలను ఆవిష్కరించింది
- రెండోరోజు గుజరాత్ పర్యటనలో ప్రధాని మోడీ

04

భారత్ నుంచి ఉగ్రవాద ముల్లును ఏరేస్తామ ని ప్రధాని మోడీ చెప్పారు. గుజరాత్ పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రధాని మోడీ గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వ హించారు. తర్వాత మహాత్మా మందిర్‌లో రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. మరోసారి పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని కీలక వ్యాఖ్యలు చేశారు.



## క్లాస్‌లు ఎగ్గొట్టినా.. వీసా రద్దు

### విదేశీ విద్యార్థులకు అమెరికా వార్నింగ్

పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా తాజాగా మరో హెచ్చరిక చేసింది. తమ విద్యా సంస్థల్లో చదివే భారత్ సహా విదేశీ విద్యార్థుల గైర్హాజరు ఆధారంగా కూడా వీసాలను రద్దు చేస్తామని వార్నింగ్ ఇచ్చింది.



06

## ప్రశ్నించే వారిపై కేసులు పరిపాటిగా మారింది

- నిర్బంధం ఇలాగే కొరసాగితే ప్రజలే తిప్పి కొడతారు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరిక

03






## 2న యువవికాసం మంజూరు పత్రాల పంపిణీ

- అక్టోబరు 2 నాటికి 5 లక్షల మంది యువతకు రూ.8,000 కోట్లతో స్వయం ఉపాధి యూనిట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, మే 27 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారులకు ఆర్థిక సాయం మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పథకం అమలుపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు.

మిగతా 2 లో

## కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు?

5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం



02



## జూన్ 2న కవిత కొత్త పార్టీ

- షర్మిల లాగే పాదయాత్రకు సన్నాహాలు
- కెసిఆర్ డైరెక్షన్‌లోనే కవిత కొత్త పార్టీ
- బిజెపి ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

03

## భారీ నష్టాల్లో సూచీలు..

24,850 దిగువకు నిఫ్టీ



07



03

## 20కోట్ల అప్పు తీర్చలేక అవస్థలు

వ్యక్తి సహా ఏడుగురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య

## మోడీ హయాంలో దేశం ఆర్థికంగా బలోపేతం

- ఎకానమిలో నాలుగో స్థానంలో భారత్
- అంజయ్యకు జరిగిన అవమానే.. రేవంత్‌కు జరిగింది
- సిఎం రేవంత్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్
- ఆపరేషన్ సిందూర్, ఆర్మీని అవమానిస్తే ప్రజలు సహించరు
- మోడీ 11 ఏళ్ల పాలనను చూసి తట్టుకోలేక పోతున్న ఖర్గే
- బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్



03

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం   తెలుగు దిన పత్రిక

# 2న యువవికాసం మంజూరు పత్రాల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

జూన్ రెండు నుంచి తొమ్మిది వరకు అన్ని నియోజకవర్గాల్లో ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయుల్లో ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ వెంటనే స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని చెప్పారు. జూన్ 2న పథకాన్ని ప్రారంభించి.. గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి రూ.8 వేల కోట్లతో ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం చేపట్టి దశలవారీగా పూర్తి చేయాలని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. గిగ్ వర్కర్లుగా ఉపాధి పొందేందుకు ద్విచక్ర వాహనాల కొనుగోలుకు అవకాశం ఇవ్వాలని పట్టణ ప్రాంతాల్లోని యువత కోరుతున్నారని.. యువవికాసంలో వారికి ఈ మేరకు అవకాశం కల్పించాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పది సంవత్సరాల భారాస పాలనలో సంక్షేమ శాఖల ద్వారా ఆయా వర్గాలకు అందిన మొత్తాన్ని ప్రజాప్రభుత్వంలో కేవలం ఒక్క ఏడాదిలోనే యువవికాసం పథకం ద్వారా ఇస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఇది ఓ రికార్డు అని.. ఏ రాష్ట్రంలోనూ ఏడాది వ్యవధిలో స్వయం ఉపాధి కోసం రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిన దాఖలాలు లేవని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ద్వారానే సాధ్యమైందన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడం కోసం వారం క్రితమే బ్యాంకర్లతో సమావేశం నిర్వహించామని.. ఆ తర్వాత సంక్షేమ శాఖల అధికారులు బ్యాంకర్లతో మాట్లాడుతూ రుణాల మంజూరు ప్రక్రియను చివరి దశకు చేర్చారని అభినందించారు. వెంటనే కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జూన్ 2న నిర్వహించే మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావును డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భట్టితో త్రీమెన్ కమిటీ భేటీ

## 29వ తేదీన సబ్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, మే 27:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముగ్గురు సీనియర్ ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది.) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో త్రిమెన్ కమిటీ- అధికారులు మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ- సీఎంకు వారు వివరించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాభవన్ లో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు త్రిమెన్ కమిటీ- అధికారులు వివరించారు. అయితే, ఈ నెల 29వ తేదీన సబ్ కమిటీ- సమావేశం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సమావేశంలో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని సబ్ కమిటీ-భేటీలో వివరించాలని అధికారుల కమిటీ-కి డిప్యూటీ- సీఎం సూచనలు చేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు అంబరాన్ని అంటాలని చెప్పుకొచ్చారు. రాష్ట్ర కీర్తి ప్రతిబింబించేలా విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

# కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు?

## 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం

**హైదరాబాద్, మే 27:** కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జూన్ 5వ తేదీన పీసీ ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. గులాబీ బాస్ కి కాళేశ్వరం మిషన్ నోటీసులు ఇచ్చినప్పటికీ నుంచి పార్టీలో కమిషన్ ముందు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది.. కానీ, చివరకు వచ్చే నెల 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారు కేసీఆర్. మరోవైపు, జూన్ 6న ఈ-టె-ల రాజేందర్, చివరగా జూన్ 9వ తేదీన హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పా-టైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా తుది దశకు చేరుకుంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈ-టె-ల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీ-సులు అందజేసింది.

# ఏసీబీ పేరుతో బెదిరింపులు

## కఠిన చర్యలు తీసుకుంటామన్న డైరెక్టర్

**హైదరాబాద్, మే 27:** అవినీతి నిరోధకశాఖ అధికారులమని ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ డైరెక్టర్ విజయ్ కుమార్ తీ వ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ మోసగాళ్లు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారని తెలిసిందని ఏసీబీ డైరెక్టర్ తెలిపారు. ఇలాంటి మోసాలు తమ దృష్టికి వచ్చినట్టు ఆయన తెలిపారు. ఏసీబీ అధికారులు ఎవరూ కేసుల విషయంలో కానీ, ఇతర కారణాలతోనూ డబ్బులు డిమాండ్ చేయరని పేర్కొన్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ నకిలీ ఏసీబీ అధికారిపై కేసు నమోదైందని వెల్లడించారు. ఏసీబీ అధికారులుగా చెప్పుకొంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే అప్రమత్తమై ఏసీబీ టోల్-ఫ్రీ నంబర్ 1064కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డైరెక్టర్ హామీ ఇచ్చారు.

# ఘనంగా పద్మ పురస్కారాలు

## అవార్డులు అందుకున్న శోభన, మందకృష్ణ

**న్యూఢిల్లీ, మే 27:** దిల్లీలో 'పద్మ' పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పలు రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సినీనటి శోభన పద్మభూషణ్ అందుకోగా.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే, ఏపీ నుంచి వి.రాఘవేంద్రాచార్య పంచముఖి, ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. పద్మభూషణ్ అవార్డును కన్నడ నటుడు అనంత్ నాగ్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, కిషన్ రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్, ప్రహ్లాద్ జోషీ సహా పలువురు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో నందమూరి బాలకృష్ణ, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వంటి తెలుగు ప్రముఖులు సహా మొత్తం 71 మందికి ఏప్రిల్ 28న పురస్కారాలు ప్రదానం చేయగా.. తాజాగా మరికొందరికి అవార్డులను అందజేశారు.

# రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ సహా కొందరు మంత్రులు జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సుల్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమల్లో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. "అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. ఎకరానికి రూ.10 వేల పరిహారం అందించేందుకు నివేదిక తయారు చేసి అధికారులు ప్రతిపాదనలు పంపాలి. వర్షాలు ముందస్తుగా వచ్చాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలి. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియాను అందుబాటులో ఉంచాలి. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి ఫలితాలను సాధిస్తోంది. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేస్తున్నాం. గతంలో కంటే ఈ సీజన్‌లో దాదాపు 22 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలుచేసిన పౌరసరఫరాల సంస్థను అభినందిస్తున్నా. 90 శాతానికిపైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నారు. తెలంగాణకు రుతుపవనాలు ముందుగా రావడంతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయి కొంతమంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. 10 లక్షల 50 వేల మంది రైతుల వద్ద నుంచి 64 లక్షల టన్నులకుపైగా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశాం. ప్రభుత్వం చేసిన మంచి పనిని చెప్పుకోవాల్సిన అవసరం ఉంది.

### ప్రజల్ని భూతంలా పీడించిన ధరణి

భూభారతి చట్టం అమలుకు ముందస్తుగా నాలుగు మండలాలను ఎంపిక చేసుకున్నాం. అనంతరం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. జూన్ 3 నుంచి 20 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో నిర్వహించాలి. వీటిలో ప్రజల నుంచి దరఖాస్తులు



స్వీకరించడంతోపాటు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతంలా పీడించింది. భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుంది.

### యువ వికాసంతో ఇటుక, సెంట్రింగ్ యూనిట్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును కలెక్టర్లు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలి. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను నియమించాలి. మేస్త్రీ ఛార్జీలు, నిర్మాణ పరికరాల ధరలో నియంత్రణలో ఉండాలి. అడ్డగోలు ధరలతో పేదలను మోసం చేయకుండా జాగ్రత్త వహించాలి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా జాగ్రత్త వహించాలి. మహిళా సంఘాలు, యువత ద్వారా 'రాజీవ్ యువవికాసం' కింద ఇటుక, సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాల ఏర్పాటు చేయించాలి. తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి అనేక కొత్త సాంకేతిక పద్ధతులు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు తెలపాలి. కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు మే 29, 30 తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై రిపోర్టు తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి" అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని సూచించారు.

### పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలి: మంత్రి ఉత్తమ్

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉందని.. పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలిపారు. 'రవాణా సమస్యలు రాకుండా రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వాహనాలు అందుబాటులో పెట్టాలి. మిల్లర్లు సహకరించకపోతే ఇంటర్మీడియట్(తాత్కాలిక) గోదాములకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి' అని ఉత్తమ్ అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 15 శాతం మాత్రమే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగతావాటి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలన్నారు.

### వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: సీఎం

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చేసిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా వచ్చిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వచ్చే ప్రమాదముంటుందని.. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఏజెన్సీ, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై మరింతగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

# తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి

- నైరుతికి తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం
- పలు జిల్లాల్లో జోరు వానలు
- వేములవాడ జలమయం
- హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన



**హైదరాబాద్, మే 27:** నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణలోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా రేపు, ఎల్లుండి తెలంగాణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక, హైదరాబాద్ నగరంలో సాయంత్రం 7.30 గంటలకి వాన ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, టోలిచౌకి, ఫిలింనగర్, మణికొండ, గచ్చిబౌలి, మియాపూర్, లింగంపల్లి, పటాన్ చెరు, ఆర్సీపురం, బీరంగూడ, సికింద్రాబాద్, మలక్ పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఆరాంఘర్, పంజాగుట్ట, చిలకలగూడ, కుత్బుల్లాపూర్, షాపూర్, సూరారం, దుండిగల్, కొండాపూర్, పాటీనతో పాటు- పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. అయితే, వర్షం నీరు రోడ్డుపై చేరడంతో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ అయింది. ఐటీ- సెక్టార్ ఏరియాలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఆదిలాబాద్, రాజన్నసిరిసిల్ల, మహబూబాబాద్, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. రానున్న రెండురోజులు కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడొచ్చిన ఐఎండీ తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. కొన్ని చోట్లు- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండలో అల్లాడిపోయిన ప్రజలకు సాయంత్రానికి కొంత ఉపశమనం కలిగింది. వరంగల్ జిల్లాల్లో కూడా వర్షం కురిసింది. వరంగల్ సిటీ-, హనుమకొండ తోపాటు- వరంగల్ రూరల్ చుట్టు- పక్కల ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నర్సంపేట డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన సాధారణ వర్షం కురిసింది. తొలకరి వర్షాలతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, నేరడిగొండ, గడియత్నూర్ బజార్, సిరికొండ మండల్లాలో భారీవర్షం కురిసింది. భారీవర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. రాజన్న సిరిసిల్లా జిల్లాలో కూడా వానలు పడ్డాయి. వేముల వాడలలో దాదాపు రెండు గంటలపాటు- వర్షం దంచికొట్టింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. 16 వవార్డు నీటమునిగింది.. దీంతో భక్తులకు చెందిన కారు, ఆటో పూర్తిగా వరదలో చిక్కుకుంది. భారీ వర్షాలతో వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట నక్క వాగు భారీగా వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతోంది. ఇక మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, మహబూబాబాద్, కొత్తగూడ మండలాల్లో ఉరుములు , మెరుపులతో కూడిన వాన పడింది. జగిత్యాల జిల్లాలో కూడా మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొడిమ్యాల, కొండగట్టు- పరిసర ప్రాంతాల్లో ఉరుములు , మెరుపులతో భారీవర్షం అతలాకుతలం చేసింది. సుమారు రెండు గంటల పాటు- దంచికొట్టింది. దీంతో కొండగట్టు-లో భక్తులు ఇబ్బంది పడ్డారు. కొడిమ్యాల మండల కేంద్రం నుంచి సూరంపేటకు వెళ్లే దారిలో దమ్మాయిపేట స్టేజి వద్దగల పోతారం వాగు పొంగిపొర్లింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సూరంపేట - గంగారం తండాల మధ్య ఉండే పోతు చెరువు నుండి పెద్ద ఎత్తున నీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతంలో కట్ట మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదు-రవుతున్నాయని ప్రజల ఆందోళన వ్యక్తం చేశారు.

# శాంతి చర్చలకు ప్రభుత్వాలు ముందుకు రావాలి

## మానవ, పౌరహక్కుల సంఘాలు, వామపక్ష పార్టీల డిమాండ్

**హిమాయత్‌నగర్:** శాంతి చర్చలు, ప్రజల ప్రజాస్వామిక హక్కు కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు ముందుకు రావాలని మానవ, పౌరహక్కుల సంఘాలు, వామపక్ష, కమ్యూనిస్టు, ప్రజాస్వామిక పార్టీలు డిమాండ్ చేశాయి. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు దేశాన్ని పాలించే హక్కులేదు. వీరిద్దరూ మావోయిస్టుల మృతదేహాలు చూసి వణుకుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో మ-రణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించకుండా పోలీసులు దహనం చేయడం దారుణం. సుప్రీంకోర్టు సుమోటోగా న్యాయ విచారణకు ఆదేశించాలి. ఎన్‌కౌంటర్ జరిగిన మ-రుసటిరోజే కేంద్ర అటవీ పర్యావరణశాఖ అడవిని కార్పొరేట్ కంపెనీకి కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది' అని అన్నారు. ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొ.హరగోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీలు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట సృష్టిస్తున్న నరమేధాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. ఒకరు చనిపోతే సంబరాలు చేసుకోవడం, దానిని గర్వకారణమంటూ ప్రకటించుకోవడం భాజపా పాలకులకే చెల్లిందన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.హన్మేష్ పాల్గొన్నారు.



# శిల్పారామంలో ఆఫ్రికన్ల సందడి

## ఆకట్టుకున్న తెలంగాణ కళా రూపాలు

**హైదరాబాద్, మే 27:** ఆఫ్రికన్ ప్రతినిధులను సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పర్యటన లో భాగంగా ఆఫ్రికా ఖండంలో మధ్య, పచ్చిమ ప్రాంతాల్లోని 15 దేశాలకు చెందిన 30 మంది ఆఫ్రికన్ ప్రతినిధులు హైదరాబాద్ పర్యటనలో భాగంగా మంగళవారం శిల్పారామం ను సందర్శించారు. ఒగ్గు డోలు బృందంతో అధికారులు ఆఫ్రికన్ ప్రతినిధులు కు స్వాగతం పలికారు. అనంతరం శిల్పారామం లో తెలంగాణ కళా రూపాలను ఆఫ్రికన్ ప్రతినిధులకు ప్రదర్శించారు. కూచిపూడి, ఒగ్గుడోలు, పేరిణి నృత్యాల ను ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శనలకు మైమరిచిపోయిన డెలిగేట్ లు కళాకారులతో కలిసి నృత్యం చేసారు. స్టాల్ లను సందర్శించారు. అంతకుముందు ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నగరంలో ఏర్పాటు చేసిన టి -వర్క్ ను సందర్శించి నూతన ఆవిష్కరణ లు తిలకించారు. మైండ్ స్పేస్ లోని హార్న్ బిల్ స్టూడియో ను సందర్శించారు. పిల్లలను ఆకట్టుకునే కార్టూన్, సినిమాలకు గ్రాఫిక్స్ రూపకల్పన పై నిర్వాహకులు ఆఫ్రికన్ డెలిగేట్ లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా హనుమాన్ సినిమాకు హార్న్ బిల్ సంస్థ అందించిన విజువల్స్ ఎఫెక్ట్ ను తిలకించి చప్పట్లతో నిర్వాహకులను అభినందించారు. ఆఫ్రికన్ కంటెంట్ క్రియేటర్ ల హైదరాబాద్ పర్యటన కార్యక్రమాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సమన్వయం చేస్తుంది.



# కారుణ్య నియామకం కల.. నెరవేరిన వేళ

## సీఎం ఆదేశాలతో ఉద్యోగం

**హైదరాబాద్:** కారుణ్య నియామకం కోసం 19 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఓ మహిళ కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాకారం చేశారు. వరంగల్‌కు చెందిన బి.రాజశ్రీకి హోంశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వులిచ్చి ఆ కుటుంబంలో సంతోషాన్ని నింపారు. పోలీస్‌శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ బి.భీమ్‌సింగ్ 1996 సెప్టెంబరు 24న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. తండ్రి మరణించిన నేపథ్యంలో కారుణ్య నియామకం కోసం రాజశ్రీ అప్పట్లోనే దరఖాస్తు చేసుకున్నారు. అయితే సాంకేతిక కారణాలు చూపుతూ అప్పటినుంచి పలు ప్రభుత్వాలు ఆమెకు ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించాయి. రాజశ్రీ సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఆయన నిబంధనలు సడలించైనా రాజశ్రీకి ఉద్యోగం ఇవ్వాలని సీఎంఓ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో ఆమెకు హోంశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజశ్రీ మంగళవారం తన కుటుంబ సభ్యులతో సచివాలయానికి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు.

# మోడీ హయాంలో దేశం ఆర్థికంగా బలోపేతం

- ఎకానమిలో నాలుగో స్థానంలో భారత్
- అంజయ్యకు జరిగిన అవమానే.. రేవంత్‌కు జరిగింది
- సిఎం రేవంత్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్
- ఆపరేషన్ సిందూర్, ఆర్మీని అవమానిస్తే ప్రజలు సహించరు
- మోడీ 11 ఏళ్ల పాలనను చూసి తట్టుకోలేక పోతున్న ఖర్గే
- బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్



**హైదరాబాద్, మే 27 :** మోదీ పాలనలో న్యాయవ్యవస్థ బలోపేతం అయిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎకానమిలో పదోస్థానంలో ఉండేదని.. మోదీ పాలనలో 4వ అతిపెద్ద ఎకానమీ దేశంగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిందని.. అయినా ప్రధానిగా మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమనేది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా చూడాలని లక్ష్మణ్ తెలిపారు. గతంలో అంజయ్యకు అవమానం జరిగిందని..ఇప్పుడు రేవంత్‌రెడ్డికి జరుగుతుందని లక్ష్మణ్ గుర్తుచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిస్తే చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను, ఆర్మీని అవమానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాసిందని తెలుస్తోందని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదని అన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అని విమర్శించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో చేయలేనిది మోదీ 11 ఏళ్లలో చేశారని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో దేశం అగ్రస్థానంలో ఉందని లక్ష్మణ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ రూ. 50లక్షల కోట్లలో.. కేవలం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ. 11లక్షల కోట్లను మోదీ కేటాయించారని లక్ష్మణ్ స్పష్టం చేశారు. మోదీ హయాంలో దేశం వందశాతం అభివృద్ధి చెందితే కాంగ్రెస్ హయాంలో 50శాతం కూడా అభివృద్ధి చెందలేదని విమర్శించారు. మోదీ హయాంలో 7.4శాతం జీడీపీ వృద్ధి చెందిందని గుర్తుచేశారు. అతి త్వరలోనే మూడో ఆర్థిక దేశంగా భారతదేశం అవతరించపోతుందని ఉద్ఘాటించారు. ఇప్పటి-కై-నా మల్లికార్జునఖర్గే ఆలోచించి మాట్లాడాలని లక్ష్మణ్ హితవు పలికారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన పైనా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్మారని లక్ష్మణ్ ఆరోపించారు. మీడియా స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చారు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారు మోడీ.. దేశంలో అభివృద్ధి తారాస్థాయికి చేరుకుంటుందని గుర్తు చేశారు. కానీ, ఎమర్జెన్సీ పెట్టింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. అయితే, ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా భారత్ చేరుకుంది.. బీజేపీ, మోడీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతుందన్నారు. ఇక, పేదరికం అనుభవించిన వ్యక్తి మోడీ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. మోడీనీ కులం పేరుతో రాహుల్ గాంధీ దూషించారు.. ఇక, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా తయారు చేస్తున్నారు మోడీ అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోడీనీ నాయకునిగా కీర్తిస్తుంటే గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అయితే, ఆపరేషన్ సింధూర్ లాంటి దాడులతో పాకిస్తాన్ కు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా చెశారా అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో భారత ప్రజలు లేరు.. రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డారు.. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానం.. గతంలో అంజయ్యకు కూడా అవమానం జరిగింది.. ఢిల్లీకి వెళ్ళి కలవడంలో తప్పులేదు.. కానీ, ఇలా పడిగాపులు పడడం తెలంగాణ ప్రజలకు అవమానం అని పేర్కొన్నారు. ఇక, బీజేపీ వెనుక రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలు చేయదు.. ఏదైనా సరే ముందు నుంచే చేస్తుందని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు.

## ప్రశ్నించే వారిపై కేసులు పరిపాటిగా మారింది

- నిర్బంధం ఇలాగే కొరసాగితే ప్రజలే తిప్పి కొడతారు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్, మే 27 :** ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్భంధం ఇలాగే కొనసాగితే ప్రజలు తిప్పికొడతారని ఆయన హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాతీయ అంశాల మీద అనేకసార్లు స్పందించారు.. ఆదానీ బొగ్గు విషయంలో గానీ, ఢిల్లీ నిరసనలో మరణించిన ఉత్తర భారత రైతుల కుటుం బాలను ఆదుకున్నది కేసీఆర్ మాత్రమే.. ఈ తరంతో పాటు-, భవిష్యత్ తరాలకు ఇప్పుడున్న పరిస్థితులకన్నా మెరుగైన జీవనం లభించే విధంగా పాలకుల చర్యలు ఉండాలి.. లేకుంటే చరిత్రలో వారికి స్థానం ఉండదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ వైఫల్యాలు అన్ని మీడియా సంస్థల వార్తలతోనే తేలిపోయింది. అయినప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. యాసంగి కోతలు పూర్తయి వానాకాలం వచ్చినప్పటికి నెలల తరబడి కొనుగోళ్ల పక్రియ కొనసాగుతుంది. ధాన్యం కొనుగోళ్లలో అడ్డగోలుగా కోతలు విధిస్తున్నా రైతుల అభ్యంతరాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మిల్లర్లను ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోమం టున్నారు.. సీఎం ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదు అంటే అసలు పాలన మీద పట్టుందా..? ప్రశ్నించిన వారిని దబాయిస్తున్నారు.. వారి మీద కేసులు పెట్టి వేధిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం ఇలాగే కొనసాగితే ప్రజలు తిప్పికొడతారు అని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో రైతులను వ్యవసాయం విషయంలో, పంటల సాగు విషయంలో ఇక్కడి వాతావరణ పరిస్థితులు వివరించి పంటల మార్పిడిని ప్రోత్సహించాం. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాం. 60 లక్షల ఎకరాలలో వరి సాగు నుండి 20 లక్షల వరకు ఇతర పంటల వైపు మల్లాలని చైతన్యం చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో 35, 40 వేలు ఎకరాలలో ఉన్న ఆయిల్ పామ్ సాగును 2 లక్షల ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగును పెంచాం. వంట నూనెల కోసం దిగుమతుల మీద ఆధారపడకుండా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తే లక్ష కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాం. ఈ దేశ విశాల ప్రయోజనాల కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అన్న అంశాలను కేంద్రానికి వివరించాం. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆపరేషన్ కగార్ ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్తజడ్జిలు

**న్యూఢిల్లీ, మే 27 :** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం పేర్కొంది.

## 20కోట్ల అప్పు తీర్చలేక అవస్థలు

### వ్యక్తి సహా ఏడుగురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య

**న్యూఢిల్లీ, మే 27 :** హర్యానాలోని పంచకులలో ఏడు మంది విషం తాగి కారులో బలవన్మరణానికి పాల్పడిన విషయం కలకలం రేపింది. ప్రవీణ్ మిట్టల్ అనే వ్యక్తికి చెందిన కుటుంబం ప్రాణాలు కోల్పోయింది. అయితే ఆ ఫ్యామిలీ సుమారు 20 కోట్ల అప్పు చేసినట్లు తెలుస్తోంది. ప్రవీణ్ మిట్టల్‌తో పాటు ఆయన భార్య, తల్లిదండ్రులు, ముగ్గురు పిల్లలు కారులో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు. సూసైడ్ నోట్ రాసి వదిలినట్లు గుర్తించారు. అంత్యక్రియల ను సందీప్ అగర్వాల్ నిర్వహించాలని కోరుతూ ఆ నోట్‌లో తెలిపారు. అయిదు రోజుల క్రితం ఆ వ్యక్తితో ప్రవీణ్ మిట్టల్ ఫోన్‌లో మాట్లాడినట్లు తేల్చారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రవీణ్ మిట్టల్ కొన్నేళ్ల క్రితం హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దిలో చెత్త ఫ్యాక్టరీ పెట్టాడు. రుణం తీర్చని కారణంగా ఆ షాపును బ్యాంకు వాళ్లు కొన్నాళ్లకు సీజ్ చేశారు. తీవ్రమైన అప్పుల్లోకి వెళ్లిన మిట్టల్.. పంచకుల నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లాడు. ఆరేళ్ల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోయిన టైంలో మిట్టల్‌కు 20 కోట్ల అప్పు ఉన్నట్లు సందీప్ అగర్వాల్ చెప్పాడు. కొన్నాళ్లు పంజాబ్‌లోని ఖరార్‌కు మకాం మార్చాడు. ఆ తర్వాత హర్యానాలోని పింజోర్‌కు వెళ్లాడు. నెల క్రితమే అతను పంచకులకు మళ్లీ వచ్చినట్లు తెలుస్తోంది. మిట్టల్ సొంత పట్టణం హిసార్‌లోని బర్వాలా. కొన్నాళ్ల నుంచి పంచకులలోని సాకేత్రి ప్రాంతం లో ట్యాక్సీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. అతని వద్ద ఉన్న రెండు ఫ్లాట్లు, వాహనాలను ఇటీవల బ్యాంక్ సీజ్ చేసింది. డెహ్రా డూన్‌లో ఉంటున్న మిట్టల్ ఫ్యామిలీ.. సోమవారం భగేశ్వర్ ధామ్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లారు. ఆ ఈవెంట్‌కు హాజరై ఇంటికి వస్తున్న సమయంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

# జూన్ 2న కవిత కొత్త పార్టీ

- షర్మిల లాగే పాదయాత్రకు సన్నాహాలు
- కెసిఆర్ డైరెక్షన్‌లోనే కవిత కొత్త పార్టీ
- బిజెపి ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



**మెదక్, మే 27 :** తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తారని, అలాగే జూన్ 2న కొత్త పార్టీ ప్రకటన చేస్తారని మెదక్ ఎంపి రఘునందన్ రావు తెలిపారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ రాబోతుందని, పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. తుప్రాన్ లో రఘునందన్ రావు పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై జోస్యం చెప్పారు. మాజీ సిఎం కెసిఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని అన్నారు. తండ్రి, కుమార్తె మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారని విమర్శించారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకని రఘునందన్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అలాంటి వేళ మెదక్ ఎంపీ , బీజేపీ నేత రఘునందన్ రావు మరోసారి స్పందించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కవిత గెలిచినప్పుడు కేసీఆర్ దేవుడయ్యారని.. మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపీ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు పార్టీ నేతలతోపాటు- కార్యకర్తలంతా భారీగా తరలి వచ్చారు. అనంతరం ఈ సభలో తన తండ్రి కేసీఆర్ ప్రసంగంతోపాటు- కొన్ని అంశాలతో కూడిన లేఖను ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాశారు. అయితే ఈ లేఖ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లేఖను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తమదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ తర్వాత కేసీఆర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ వరుసగా సమావేశమవుతున్నారు. మరోవైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ కేసీఆర్‌తోపాటు- హరీష్ రావు, ఈటల రాజందర్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. జూన్ 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలంటూ బీఆర్ఎస్ చీఫ్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ టాపిక్ డైవర్షన్ కోసమే ఈ లెటర్ పాలిటిక్స్ అనే ఓ చర్చ సైతం రాష్ట్రంలో కొనసాగుతోంది.

## అవినీతిలో మునిగిన బిఆర్ఎస్ నేతలు

- నీతులు పలికితే జనం నమ్మరు
- లిక్కర్ కవిత ఎవరికి నీతులు చెబుతారు
- మండిపడ్డ బిజెపి నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 27 :** బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచిన బీఆర్ఎస్ ఇప్పుడు నీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ కేసులో జైలు నుంచి వచ్చి కవిత ఎవరికి నీతి పాఠాలు చెబుతోందని అంటూ ప్రశ్నించారు. కుంభకోణాలకు సంబంధించి కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు వచ్చాయని, ఇవి రాజకీయ నోటీసులు కాకుండా అవినీతి ఆరోపణలపై విచారణ నోటీసులేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా, ఎమ్మెల్యేగా విఫలమయ్యారు. కేటీఆర్ ఇప్పటికే అనేక విచారణలకు లోనవుతున్నారు. ఇదే సమయంలో హరీష్ రావు, కవిత వంటి నేతలు కూడా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అందుకే ఈ నేతలు తక్షణం తమ పదవులకు రాజీనామా చేయాలని అన్నారు. ఈటల రాజేందర్‌కు వచ్చిన నోటీసులపై పార్టీ స్థాయిలో చర్చించి తదుపరి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈటలపై విచారణ జరుగుతుంది. ఈ విచారణలో బీఆర్ఎస్ నేతల అవినీతి ఆరోపణలు బట్టబయలవుతాయని మేము ఆశిస్తున్నాం, అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. కవిత లేఖ బయటకు వచ్చిందన్నదే కాదు.. డీల్ బయటపడినందుకే వాళ్లకు భయం అంటూ బీఆర్ఎస్ నేతలను మరోసారి విమర్శించారు. నీతి ఆయోగ్ 10వ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. అయితే 9వ సమావేశానికి హాజరుకాలేదని గుర్తుచేస్తూ, అప్పుడు ముఖ్యమంత్రి ఎవరినిమిత్తం, ఎందుకోసం గైర్హాజరయ్యారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. నీతి ఆయోగ్ సమావేశాల ఉద్దేశం రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న దానిపై కేంద్రం నమ్మకం పెట్టుకున్నదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ఫెడరల్ స్ఫూర్తితో సమావేశంలో పాల్గొనడం సానుకూల పరిణామం. కానీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదు. కనీసం ఇప్పుడు అయినా వాటిని అమలు చేయాలని అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే నోటీసులు

- కెటిఆర్‌కు నోటీసుల వెనక కాంగ్రెస్ కుట్రలు
- మండిపడ్డ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, మే 27 :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. అవినీతి విషయంలోనే అద్భుత ప్రగతి సాధిస్తున్నదని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో కమిషన్లే వారి ఎజెండా అని మండిపడ్డారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలి, సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలన్న సోయి తప్ప మరొకటి లేదన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకునే విషయంలో పోటీపడుతున్నారని చెప్పారు. సూర్యాటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు మరోసారి నోటీసులు, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఖండించారు. ప్రశ్నిస్తున్న వాళ్లకు నోటీ-సులు ఇప్పించి బయపెట్టాలని చూస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్‌లో రేవంత్ పేరును ఈడీ పేర్కొన్నప్పటికీ.. మోదీని కలవడానికి వెళ్లాడంటేనే ఆయన బుద్ధి అర్థమవుతుంది. దీనినిబట్టి రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ దోస్తీ ఎట్లుందో తెలుస్తుంది. రేవంత్ చిల్లర చేష్టలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడు. అందాల పోటీలతో ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీసిండు. కేటీఆర్‌కు నోటీసులిస్తే బయపడతామనుకుంటున్నారా?. ఆనాడు కేటీఆర్ స్వయంగా 8 గంటలు కూర్చుని చెప్పిన విషయం మీకు గుర్తుకులేదా అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుందని రేవంత్ ఏడుస్తున్నది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఇతర దేశాల ఆహ్వానం మేరకు వెళ్తున్నాడని తట్టుకోలేక పోతున్నారు. వాటికీ హాజరుకాకుండా ఆపాలనే అక్కసుతోనే నోటీసులు ఇచ్చారు. నోటీసులతో చిల్లర డ్రామాలు చేస్తూ మరింత నవ్వుల పాలవుతున్నారు. చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయలేరు. 18 నెలలైనా ఇంకా బీఆర్ఎస్ మీద ఏడుపు తగ్గలేదు. కేసీఆర్ కాళేశ్వరం ఎందుకు కట్టిండో కాంగ్రెస్‌కు అవగాహన లేదు. మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదు. చిల్లర చేష్టలు మానుకొని ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదన్నారు. ప్రోటోకాల్ చూడాల్సిన బాధ్యత ఆఫీసర్ల పని. కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ చిల్లర మూకలకు ఏంపని. కేటీఆర్ క్రేజ్ ఖండాతరాలకు వ్యాపించింది. ఆ ఏడుపుతోనే తమ నాయకుడిపై చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పనికిమాలిన చర్యలతో మరింత అభాసుపాలవుతున్నది. రేవంత్ బాసులనే తరిమికొట్టి తెలంగాణ తెచ్చినోళ్ళం. ఆయన చిల్లర చేష్టలకు భయపడతామా. తస్మాత్ జాగ్రత్త.. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయండని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు ఏసీబీ నోటీసులు సిరిసిల్ల క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అందాల పోటీల నిర్వహణలో విఫలమై ప్రపంచం ముందు తెలంగాణ పరువు పోగొట్టారని, కేటీఆర్ విజన్ ఖండతరాలు పాకుతుంటే ఓర్వలేకే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేష్టలతో త్వరలో ప్రజల్లో తిరుగుబాటు ఖాయమని, కాంగ్రెస్ పీడను ఎప్పుడు వదిలించుకోవాలని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని జగదీష్ రెడ్డి అన్నారు.

## సెప్టెంబర్ 15 వరకు ఐటిఆర్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 27 :** ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై ఐటీ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రిటర్నుల దాఖలు తుది గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐటీ- విభాగం కీలక ప్రకటన జారీ చేసింది. నిజానికి 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జులై 31తో ముగియనుంది. ఆ గడువును ఐటీ విభాగం తాజాగా సెప్టెంబర్ 15 వరకు పెంచింది. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం అయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు- ఐటీ- విభాగం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నోటిఫై చేసిన ఐటీ-ఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా సిస్టమ్‌ను సిద్ధం చేయడానికి కొంత సమయం పడుతుందని, ఈ క్రమంలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం జులై 31తో ముగియనున్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్టు- ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది.

## రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారులకు శుభవార్త

### జూన్ 2న మంజూరు పత్రాలు అందిస్తాం: సీతక్క



**హైదరాబాద్, మే 27 :** తెలంగాణలోని నిరుద్యోగులకు మంత్రి సీతక్క శుభవార్త తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యువత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే నిర్మల్ జిల్లా కలెక్టర్ పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసింది. నాయక్ పోడులు అంటే నిర్మల్ జిల్లా కలెక్టర్ కు తెలియకపోవడం బాధాకరం అన్నారు. అధికారిగా ఉన్నప్పుడు వాళ్లు అన్ని తెలుసుకోవాలని సూచించారు. ఏ కులం, ఏ రిజర్వేషన్ వస్తదో తెలియకపోవడం వారి తప్పు.. రాజ్యాంగాన్ని చదవాలని తెలిపింది. ఏ కులం వారికి ఏయే రిజర్వేషన్లు, ఏం హక్కులు ఉన్నాయే తెలుసుకోని వాటిని అమలు చేయాలని చెప్పుకొచ్చింది. ఇలాంటి సమస్య ఎక్కడెక్కడా ఉందో నా దృష్టికి తీసుకురండి.. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా సర్టిఫికెట్ల సమస్య పరిష్కరించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లకు లెటర్లు పంపిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. అయితే, నాయక్ పోడ్ వారికి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా చూస్తామని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యంగా పేదల పక్షాన ఈ ప్రభుత్వం నిలపడుతుంది.. పోడు భూముల సమస్యను ప్రభుత్వంతో మాట్లాడి.. నెరవేరే విధంగా చూస్తాను అని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో ప్రత్యేకంగా కొన్ని ఇళ్లు నాయక్ పోడ్లకు అందించేలా మంత్రితో మాట్లాడతాను అని పేర్కొన్నారు. అలాగే, జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రం వచ్చే విధంగా చూస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఇక, ఆదివాసీల త్యాగాలు ఎక్కువ.. ఫలాలు తక్కువ అని మంత్రి సీతక్క తెలిపింది. గిరిజన ప్రాంతాలలో నీరు ఉన్నా.. కానీ, ఆదివాసీలకు ప్రయోజనం లేదు అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఆదివాసీల ఉన్నారు.. ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు లేక నిధులు ఏర్పాటు- చేయలేక పోతున్నారు.. జాతి, కులగణన లేనప్పుడు ప్రత్యేక నిధులు కేటాయించడం సాధ్యం కాదని వెల్లడించింది. ఆందరి కులాల దేవుళ్లను గౌరవిద్దాం.. అంతిమంగా మన జాతికి ఉన్న సాంస్కృతిక కార్యక్రమాలను కాపాడుకుందాం.. జాతి గుర్తింపు ఉండాలంటే వేషధారణ ముఖ్యం అని సూచించింది. ములుగు లాంటి ప్రాంతాలలో కాకతీయుల కాలంలో భాష మారింది అని సీతక్క చెప్పారు.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# కోట ఆత్మహత్యల రహస్యం ఛేదించేదెవరు?



విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాజస్థాన్ కోటలో నీట్ పరీక్షల కోచింగ్ వెళుతున్న విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నారు. తాజాగా కాశ్మీర్‌కు చెందిన ఓ అమ్మాయి బలవన్మరణం చెందింది. ఇటీవలే కోట ఆత్మహత్యలపై సుప్రీం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కోటలోనే ఎందుకు ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నది భేతాళ కథల్లా మారింది. ఇప్పటి వరకు అక్కడ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో గుర్తించడం లేదు. గతంలో ఐఐటిల్ల వరుసగా ఆత్మహత్యలు కలవర పెట్టేవి. తరవాత మన తెలుగు రాష్ట్రాల్లో నారాయణ, చైతన్య కాలేజీల్లో చదువుకునే వారిలో ఆత్మహత్యలు కనిపించేవి. ఇప్పటికీ ఈ రెండు కాలేజీల్లో ఐఐట కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు అడపాదడపా ఆత్మహత్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ఉన్నత విద్యావంతులు కావమెలా ఉన్నా అసలు ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులతో తల్లిదండ్రులు గుండెశోకంతో తల్లడిల్లుతున్నారు.దేశంలో రాజస్థాన్ కోటా నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ప్రచారంలో ఉంది. ఇక్కడ కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని అనేక మంది భావిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగించేదిగా ఉంది. గతంలో ఇదే విషయంలో సుప్రీంకోర్టు సైతం అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది. ఈ సంవత్సరం కోటాలో జరిగిన 14 ఆత్మహత్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని కూడా చెప్పింది.

ఈ విషయంలో కోటా ఎస్పీకి కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మరో 18 ఏళ్ల విద్యార్థిని సూసైడ్ చేసుకుంది. జమ్మూ కశ్మీర్ నివాసి అయిన విద్యార్థిని జీషాన్ నీట్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు నెల రోజుల క్రితం కోటాకు వచ్చారని మహావీర్ నగర్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. ఆ విద్యార్థిని మహావీర్ నగర్ ప్రతాప్ కూడలి వెనుక అద్దె ఇంట్లో ఉండేది. ఈ క్రమంలోనే అద్దె ఇంట్లోని ఒక గదిలో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పోలీసులు ఆ విద్యార్థిని గురించి, ఆమె పరిచయస్తులు, స్నేహితుల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ విద్యార్థిని చివరగా జమ్మూ కశ్మీర్‌లో బుర్హాన్ అనే వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చెప్పారు. మాట్లాడుతూనే ఆ విద్యార్థిని తన గదికి వెళ్లిందన్నారు.

ఆ క్రమంలో బుర్హాన్ తన ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి, కోటాలో తనకు తెలిసిన ఒక అమ్మాయికి సమాచారం ఇచ్చి, జీషాన్ దగ్గరకు వెళ్ళమని అడిగినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పరిచయస్థురాలైన అమ్మాయి ఆమె ఇంటికి చేరుకునేసరికి, గది గేటు లోపలి నుంచి మూసి ఉంది. ఆ తరువాత, సమీప ప్రాంతాల వారికి విషయం తెలిపి గది డోర్ కట్టర్‌తో కత్తిరించగా, విద్యార్థిని లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆ సమయంలో ఆత్మహత్య చేసుకున్న గదిలో ఉరిని నిరోధించే ఫ్యాన్స్ లేవని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో పోలీసులకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఈ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కోటాలో ఫ్యాన్ సూసైడ్ మరణాలను నిరోధించేందుకు ఆ ప్రాంతాల్లోని హాస్టళ్లు సహా విద్యార్థులకు అద్దెకు ఇచ్చే గదుల్లో స్ప్రింగ్‌తో వేలాడే ఫ్యాన్లను అమర్చాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. వాటిని ఉపయోగించడం వల్ల ఫ్యాన్ సూసైడ్ మారణాలను అరికట్టవచ్చని తెలిపింది. కానీ ఈ విధానాన్ని అక్కడి వారు పాటించకపోవడం కూడా వారి మరణాలకు మరింత అవకాశాలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతోపాటు గతంలో నీట్ కోచింగ్ సమయంలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై కూడా ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారా లేక మరేదైన కారణం ఉందా అన్నది అంతు చిక్కడం లేదు. ఈ దిశగా పోలీసులు కూడా పెద్దగా దర్యాప్తు చేపట్టడం లేదు. సుప్రీం ఆదేశాలతో కదులుతారా లేదా అన్నది కూడా అనుమానమే. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరు శాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొలబద్దలుగా నిలిచాయి. పోటీ ప్రపంచపు తూకపు రాళ్లలో ఒక్క గ్రాము అటు ఇటూ అయినా విద్యార్థులు బలవన్మరణా లకు పాల్పడుతున్నారు. కోటలోనే కాదు ఇంటర్, టెన్త్ ఫలితాలు తమకు అనుకూలంగా రాకున్నా విద్యార్థులు ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. పరీక్షలో ఫెయిల్ కావడాన్ని తట్టుకోలేక పోతున్నారు. ఇకపోతే ఎపిలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల తరువాత నలుగురు, ఇంటర్మీడియట్ ఫలితాల తరువాత ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలే నిదర్శనం. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక విద్యార్థి బలవన్మరణం పాలవుతున్నాడు. వీరిలో అత్యధికులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఈ పోటీ ప్రపంచంలో విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం వంటి కనీస అవసరాలు సామాన్యులకు ఎండమావులుగా మారుతున్నాయి. వాటి కోసమే తల్లిదండ్రులు తమ చిన్నారులను పరీక్షల, ర్యాంకుల ఎడారుల్లో పరుగులు పెట్టిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పని చేసే టీచర్లు , అధ్యాపకులదీ ఇదే స్థితి. ఎప్పటికప్పుడు కొత్త ర్యాంకర్లను ఉత్పత్తి చేయకుంటే వేలాడుతున్న కత్తి వారి మెడమీద పడటం ఖాయం! ఈ భయోత్పాత స్థితే అభం, శుభం తెలియని పసిపిల్లలకు మరణశాసన మౌతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం పూనుకోవాలి. వాటిని ప్రాథమిక హక్కులుగా మార్చాలి. తమకు నచ్చిన అంశంపై విద్యార్థులు దృష్టి సారించాలి. పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్య! ఆ బాధ్యతను అవి నెరవేర్చుకుంటే నిలదీయాలి. పోటీలు పడే విద్యను దూరం చేయాలి. మంచి వాతావరణంలో పాఠాలు నేర్పే ప్రయత్నాలు మొదలవ్వాలి. అప్పుడే విద్యారంగం బాగు పడుతుంది. అలాగే ఆత్మహత్యల నిరోధం తగ్గుతుంది. వారిలో ఆత్మస్థయిర్యం పెంచేలా బోధనలు సాగాలి. ర్యాంకులు రాకుంటే జీవితం లేదన్న భావన నుంచి బయటపడేయాలి.

# ఉగ్రవాద ముల్లునే ఏరిపడేస్తాం

- 1947లో దేశాన్ని ముక్కలు చేసిన దగ్గరనుంచీ పాక్‌ది ఉగ్రబాటే
- పివోకే స్వాధీనంలో పటేల్ మాటలను లక్ష్యపెట్టని పాలకులు
- అదే ఇప్పటికీ మనలను వేధిస్తోంది
- గుజరాత్ పర్యటనలో ఎల్లెడలా దేశభక్తి కనిపించింది
- ఇది భారత్ ప్రజల హృదయాలను ఆవిష్కరించింది
- రెండోరోజు గుజరాత్ పర్యటనలో ప్రధాని మోడీ





**గాంధీనగర్, మే 27 :** భారత్ నుంచి ఉగ్రవాద ముల్లును ఏరేస్తామని ప్రధాని మోడీ చెప్పారు. గుజరాత్ పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రధాని మోడీ గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత మహాత్మా మందిర్‌లో రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. మరోసారి పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నుండి ఉగ్రవాద ముల్లును తొలగించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నేను గత రెండు రోజులుగా గుజరాత్‌లో ఉన్నాను. నిన్న వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్.. ఈరోజు గాంధీనగర్‌ను సందర్శించాను. నేను ఎక్కడికి వెళ్ళినా.. అది కాషాయ సముద్రం గర్జించే శబ్దంలాగా, దేశభక్తి తరంగంలా అనిపించింది. కాషాయ సముద్రం గర్జన, రెపరెపలాడే త్రివర్ణ పతాకం, ప్రతి హృదయంలో మాతృభూమి పట్ల అపారమైన ప్రేమను చూపించింది. ఇది చూడటానికి మరపురాని దృశ్యం అని ఆయన అన్నారు. 1947 లో దేశం మూడు భాగాలుగా విభజించబడింది. ఆ రాత్రినే, కాశ్మీర్‌లో మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. మన దేశంలో కొంత భాగాన్ని ముజాహిదీన్ పేరుతో ఉగ్రవాదులను ఉపయోగించి పాకిస్తాన్ స్వాధీనం చేసుకుంది. ఆ రోజున, మనకు పిఓకె వచ్చే వరకు మన సాయుధ దళాలు ఆగకూడదని సర్దార్ పటేల్ చెప్పినా.. ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మనం గత 75 సంవత్సరాలుగా ఈ ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాం. పహల్గామ్ కూడా దానికి ఒక ఉదాహరణ. పాకిస్తాన్‌తో యుద్ధాలు జరిగినప్పుడు, మేము పాకిస్తాన్‌ను మూడుసార్లు ఓడించాం అని మోడీ చెప్పారు. ఒక శరీరం ఎంత బలంగా ఉన్నా, ఒక ముల్లు గుచ్చుకుంటే అంతా నొప్పిగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పాకిస్థాన్ మద్దతుతో దేశంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదమే ఆ ముల్లు అని, దాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందని ఆయన గుర్తు చేశారు. దేశ భద్రత, అభివృద్ధి, సంస్కృతి, జాతీయ గౌరవం గురించి మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని ప్రతి మూలలో దేశభక్తిని చూశానని, ఇది కేవలం గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ప్రతి భారతీయుడి హృదయంలో ఉందని మోదీ పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో రెండో రోజు వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలను సందర్శించిన తర్వాత మోదీ గాంధీనగర్‌లో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. 1947 విభజన తర్వాత మొదలైన ఉగ్రవాద దాడులను గుర్తు చేసిన ఆయన, ఆ రోజు ముజాహిదీన్‌ను అంతమొందించి, సర్దార్ పటేల్ సలహాను పాటించి ఉండి ఉంటే, ఈ 75 ఏళ్ల ఉగ్రవాద చక్రం మనకు కనిపించేది కాదన్నారు. పాకిస్థాన్ ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక పరోక్ష యుద్ధంగా వినియోగించుకుంటోందని, కానీ అది నిజానికి ఒక వ్యూహాత్మకమైన యుద్ధమేనన్నారు ప్రధాని మోదీ. ఇటీవలి కాలంలో జరిగిన భారత ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి కూడా ప్రధాని వివరించారు. 22 నిమిషాల్లో భారత్ 9 పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇది కెమెరాల ముందే జరిగింది. ఇక రుజువుల కోసం ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. శవపేటికలపై పాక్ జెండాలు పెట్టి, వారికి సెల్యూట్ చేయడం ద్వారా, వారు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా ప్రధాని మోదీ, దేశ భద్రతపై మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. 2014 మే 26న నేను ప్రధాని పదవిని స్వీకరించాను. అప్పటి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానం. కానీ ప్రస్తుతం అది నాలుగో స్థానానికి చేరిందని మోదీ గుర్తు చేశారు. ప్రపంచమంతా కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కుంటున్నప్పటికీ భారతదేశం తన గమ్యాన్ని వదులుకోలేదని ఆయన అన్నారు. మన లక్ష్యం 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్. స్వాతంత్ర్యం పొందిన 100 సంవత్సరాల సందర్భంగా, మన దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. శాంతియుత సహజీవనం భారత్ లక్ష్యమని, కానీ, ఆ శాంతిని సవాలు చేస్తే, భారతదేశం తక్షణమే స్పందిస్తుందని, ఇది వీరుల భూమి అని మోదీ వెల్లడించారు.

# రాజకీయ వ్యవస్థలో కేటీఆర్ అజ్ఞాని

- శకుని పాత్ర పోషిస్తున్న మాజీ మంత్రి
- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**హైదరాబాద్, మే 27 :** తెలంగాణ రాజకీయాల్లో కేటీఆర్ అజ్ఞాని అని,మాజీమంత్రి కేటీఆర్‌పై తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ శకుని పాత్ర పోషిస్తున్నారని మెట్టు సాయి కుమార్ విమర్శించారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని పొదుపుగా మాట్లాడాలని స్ట్రాం÷–రగ్ వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం గాంధీ భవన్‌లో మెట్టుసాయి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ గురించి పది నిమిషాల పాటు ఆలోచిస్తే.. మీ పార్టీలో ఆ నలుగురు తప్ప ఎవరూ ఉండరని మెట్టు సాయి కుమార్ అన్నారు. తెలంగాణలో కేటీఆర్ భాషలోనే ఆయనకు సమాధానం చెబుతామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ మత్తులో తెలంగాణ భవన్‌లో కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం మీద కేటీఆర్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా అని తమ నేతలు చేసిన ఛాలెంజ్‌కి కేటీఆర్ భయపడిపోయారని విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. తెలంగాణను పది సంవత్సరాల పాటు కొరివిదెయ్యంలాగా పీల్చుకొని తిన్నది మీరు కాదా అని ప్రశ్నించారు. ఆయన సోదరి కవిత దెయ్యం అనే పదం వాడింది..నీ గురించా, నీ మామ గురించా మీకే తెలియాలని అన్నారు. దెయ్యం, శకుని అన్ని బీఆర్ఎస్‌లోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసిన అరాచకాలను ఇంకా తెలంగాణ ప్రజలు మర్చిపోలే దని అన్నారు. కేసీఆర్ యువజన కాంగ్రెస్ నాయకుడిగా గతంలో పనిచేశారని.. ఈ విషయం కేటీఆర్ తెలుసుకోవాలని చెప్పుకొచ్చా రు. రేవంత్‌రెడ్డి కొట్టిన దెబ్బకు బీఆర్ఎస్ అధోపాతాళానికి పోయిందని విమర్శించారు. దివంగత నేత వైఎస్సార్‌ని ఆదర్శంగా తీసుకొని రేవంత్‌రెడ్డి స్వర్ణయుగం లాగా తెలంగాణను పాలిస్తున్నారని మెట్టుసాయి కుమార్ పేర్కొన్నారు.

# సింగరేణి జాగృతి ఆవిర్భావం

## కోఆర్డినేటర్లను నియమించిన కవిత

**హైదరాబాద్, మే 27 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సింగరేణి జాగృతి ఆవిర్భావించింది. మంగళవారం తన నివాసంలో సింగరేణి కార్మికులతో కవిత సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. టీ–బీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామన్నారు. బహుజనులు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం అని కవిత స్పష్టం చేశారు. సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించినట్లు– పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటైందన్నారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతాం. కేసీఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని.. అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ కోసం పని చేస్తున్నాడని అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్కమాట మాట్లాడటం లేదు. అలియాస్ నేమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని కవిత డిమాండ్ చేశారు.

# అసత్య ప్రచారాల్లో ఆరితేరిన పాక్

## కువైట్ పర్యటనలో దులిపేసిన అసద్



**న్యూఢిల్లీ, మే 27 :** పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అందజేసిన చిత్రపటం బహుమతిపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కువైట్‌లో భారతీయ ప్రవాసులతో జరిగిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాట్లాడిన ఓవైసీ, పాకిస్తాన్ చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని ఉద్దేశిస్తూ, నకల్ కర్నేకే లియే అకల్ చాహియే‘ అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2019లో చైనా సైన్యం నిర్వహించిన డ్రిల్‌కు చెందిన ఫోటోను ఇప్పుడు పాక్ సైన్యం 'ఆపరేషన్ బన్యాన్' విజయంగా చిత్రీకరించి ప్రధానికి బహుమతిగా ఇస్తున్నారంటే ఎంత దిగజారిపోయారో అర్థం అవుతుందని ఆయన మండిపడ్డారు. పాకిస్తాన్ చేస్తున్న అసత్య ప్రచారాలపై ప్రజలు నమ్మకం పెట్టకూడదని, అధికారిక భారత ప్రభుత్వ ప్రకటనలకే మద్దతు ఇవ్వాలంటూ ప్రవాస భారతీయులకు ఓవైసీ సూచించారు. భారత్ అంతర్జాతీయంగా శక్తిమంతమైన దేశంగా ఎదుగుతున్న వేళ, ఇలాంటి అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలన్న ప్రయత్నాలు ఎంత సిగ్గుచేటో అని విమర్శించారు. పాక్ తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు.



# ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పట్ల వివక్ష

## ఉన్నత పోస్టుల భర్తీలో మోడీ నిర్లక్ష్యం: రాహుల్

**న్యూఢిల్లీ, మే 27 :** ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల వారి పట్ల మోడీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతుల చెందిన వారి పట్ల మోడీ ప్రభుత్వం చూపుతున్న వివక్షను వ్యవస్థాగత వివక్షగా రాహుల్ అభివర్ణించారు. ఈ తరగతులకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులను ఎన్‌ఎఫ్ఎస్ (నాట్ ఫౌండ్ సూటబుల్) అని తిరస్కరిస్తున్నారు. ఇది మనువాదం యొక్క కొత్త రూపం అని రాహుల్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతులకు చెందిన అభ్యర్థులను నాయకత్వ పాత్రల నుండి మినహాయించడానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగానే వారిని అనర్హులుగా మార్చేస్తుంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 60 శాతం రిజర్వ్‌డు ప్రొఫెసర్ పోస్టులు, 30 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. సమానత్వానికి విద్య ఒక సాధనం అనే బిఆర్ అంబేద్కర్ దృక్పథాన్ని మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు చెందిన వారిని ఉద్దేశపూర్వకంగానే 'నాట్ ఫౌండ్ సూటబుల్' అని తిరస్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈవిధమైన చర్యలతో రాజ్యాంగంపై దాడి చేస్తోంది. సామాజిక న్యాయ ద్రోహానికి పాల్పడుతోంది. ఐఐటిలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు ఇలా అన్నిచోట్ల వీరిపై కుట్ర జరుగుతోంది. వీరు చేసే పోరాటం విద్య కోసమో, ఉపాధి కోసమో చేసే పోరాటం కాదు. ఇది హక్కులు, గౌరవం, భాగస్వామ్యం కోసం చేసే పోరాటమని' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తాను ఢిల్లీ యూనివర్సిటీ– స్టూడెంట్ యూనియన్ (డియుఎస్‌యు) విద్యార్థులతో మాట్లాడానని.. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు వ్యతిరేక చర్యపై పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

# ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోంది

- కడపలో తొలిసారి మహానాడు నిర్వహిస్తున్నాం
- సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేరింగ్ సాధించాం
- ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం బాగా కలిసి వచ్చింది
- పీక కోస్తున్నా.. జై తెలుగుదేశంఅన్న చంద్రయ్య మనకు స్ఫూర్తి
- మహానాడు వేదికగా అధ్యక్షుడు చంద్రబాబు తొలి పలుకులు



**కడప, మే 27 :** దేవుని గడపలో జరిగే ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోంది. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం. ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం. కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పసుపు పండుగ మహానాడు మంగళవారం ఉదయం కడపలో ఆరంభమైంది. ప్రాణ సమాణమైన టీడీపీ కుటుంబ సభ్యులందరికీ స్వాగతం అంటూ కడప మహానాడులో సీఎం చంద్రబాబు నాయుడు తన ప్రసంగాన్ని ఆరంభించారు. కడప గడ్డపై తొలిసారి మహానాడు నిర్వహిస్తున్నామని, దేవుని కడపలో జరిగే మహానాడు చరిత్ర సృష్టించబోతోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేరింగ్ సాధించాం. ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం వల్ల కూడా మనకు కలిసి వచ్చింది. పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు.. వాళ్ల పని అయిపోయింది. పాలన అంటే హత్య రాజకీయాలు, వేధింపులు, తప్పుడు కేసులు కాదు. విధ్వంసం పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రశ్నించిన కార్యకర్తలని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు. పీక కోస్తునా చంద్రయ్య జై తెలుగు దేశం అంటూ ప్రాణాలు వదిలాడు. ఆయనే మనకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే పార్టీని నడిపిస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా కార్యకర్తల్లో అదే జోరు. ఏమీ ఆశించకుండా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే విజయం సాధ్యమైందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు.కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని సీఎం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం అని, ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. మహానాడులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిలో ఉండేది. తిరుమల తొలిగడప కడపలో ఈరోజు మహానాడు చేసుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం సభ ప్రారంభమైంది. పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు.. వాళ్ల పని అయిపోయింది. అని సిఎం చంద్రబాబు అన్నారు. ఉదయం 10 గంటల వరకు ప్రతినిధుల నమోదు కార్యక్రమం జరిగింది.



## దాతృత్వం చాటుకున్న డా.ర్యాకల శ్రీనివాస్

**భువనగిరి రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు పల్లెపాటి యాదగిరి ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయం కావడం జరిగింది. మంగళవారం రోజున హైదరాబాదులో చికిత్స పొందుతున్న హాస్పిటల్ కి వెళ్లి యాదగిరిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకుడు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.



## వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ యుగేందర్ గౌడ్

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం రోజున సిపి ఆదేశాల మేరకు వలిగొండ మండల కేంద్రంలో భువనగిరి చిట్యాల ప్రధాన రహదారిపై తమ సిబ్బందితో వాహన తనిఖీలను చేపట్టారు. అందులో భాగంగా నెంబర్ ప్లేట్ లేని ఐదు బైకులను సీజ్ చేసినట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అదేవిధంగా ప్రతి వాహన దారుడు వాహన చట్టం నిబంధన ప్రకారం నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

### ఉపాధి హామీ కూలీల

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



- ఈ నెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయండి
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్
- వ్యవసాయ కార్మిక సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు అంజయ్య

**షాబాద్, రాజముద్ర న్యూస్ :** షాబాద్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు బేగరి అంజయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లుల విడుదలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ... కూలీల వేతన బకాయిల విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని, మే 30న ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తుందున ఈ కార్యక్రమాన్ని షాబాద్ మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కొత్త జాబ్ కార్డులు, భార్యా భర్తలకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, స్పిట్టింగ్ జాబు కార్డులు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, పర్మనెంట్ చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వంద రోజులు పూర్తయిన ఉపాధి హామీ కూలీలకు ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లపై 30న కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ధర్నా కార్యక్రమానికి షాబాద్ మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు షాబాద్ మండల కన్వీనర్ నరసింహ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఎదిరే నరసింహ, సుధాకర్, వర్ధన్, కార్తీక్, శంకర్, కార్తీక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



### యువత ప్రథమ చికిత్సపైన

## అవగాహన కలిగి ఉండాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె రామస్వామి

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** యువత ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స పట్ల అవగాహన కలిగి ఉండాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె రామస్వామి అన్నారు. మంగళవారం చేవెళ్లలో జరుగుచున్న తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేన దళ్ శిక్షణ శిబిరంలో రెండవ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడము జరిగిందని అయన తెలిపారు. జనసేవ దళ్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులు ప్రథమ చికిత్స పైన అందరికీ అవగాహన ఉండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆలూరు పి హెచ్ సి నుండి డాక్టర్ వేద హాజరయ్యారని, శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులకు ప్రథమ చికిత్స పైన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యంపైన, తీసుకునే ఆహారంపైన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కె శ్రీనివాస్, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) గ్రాడ్యుయేషన్

# పట్టా పొందిన తిరునగరి వెంకటేశ్వర స్వామి

- తెలంగాణ టి హబ్ లో తిరునగరి వెంకటేశ్వర స్వామి కి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ గ్రాడ్యు యేషన్ పట్టా ప్రదానం
- ఏ ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఎలక్ట్రో మాగ్నేటిక్ రేడియేషన్ కు చెక్






**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ టి హబ్ లో డా॥ తిరునగరి వెంకటేశ్వర స్వామికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గ్రాడ్యుయేషన్ పట్టా ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ గ్లోబల్ సమ్మిట్ ద్వారా సంజీవని యాంటీ రేడియేషన్ పిరమిడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐ టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టి కన్సల్ట్ చైర్మన్ సందీప్ మక్తల, డిజిప్రెన్యూర్ ఏ ఐ తెలుగు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ బూట్ క్యాంపు ద్వారా భవిష్యత్ లో ఏ ఐ స్కిల్స్ క్రియేట్ అండ్ లీడ్ నిర్వహించిన నిఖిల్ గుండా కి గ్రీన్ ట్రీస్ ఎనర్జీ డాట్ కామ్ ద్వారా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరునగరి స్వామి మాట్లాడుతూ... ఐ టి రంగం నేడు రేడియేషన్ పొల్యూషన్ తో గడగడ లాడిస్తుందని, ప్రతి ఇంటిలో రేడియేషన్ అధిక శాతం ఉండడంతో అనేక జబ్బులకు గురవుతున్నా రని ప్రొద్దున మనం లేచినప్పటి నుండి రేడియేషన్ జోన్ లో నే బతుకుతున్నామని డాక్టర్ తిరునగరి స్వామి అన్నారు. మనం గతంలో ఎన్నడూ చూడని ఫర్టిలిటి సెంటర్లు పుట్ట గొడుగుల్లా విస్తరిస్తున్నాయని, నిద్రలేమి, సంతాన లోపం తో నేటి యువత స్ట్రెస్ కి గురౌతున్నారు. మనం ఇంతకాలం లాప్ టాప్, మొబైల్ ఫోన్లలో మాత్రమే రేడియేషన్ ఉంటుంది అనుకున్నాం అంతకు మించిన రేడియేషన్ ప్రతి ఇంటి లోను ఉన్నమాట నిజం. హెయిర్ ఫాల్, స్లీప్ లెస్ నెస్, మైగ్రెన్ తలనొప్పి, నరాలు బలహీనత, కిడ్నీ, హార్ట్ ప్రాబ్లెమ్, హియరింగ్ ప్రాబ్లమ్స్, వీర్య కణాల బలహీనత, మెమరీ లాస్, బ్రెయిన్ కాన్సర్, డి యన్ ఏ డామేజ్ కావడానికి కూడ రేడియేషన్ కారణమని డబ్ల్యు హెచ్ ఓ నివేదిక లో వెల్లడించారు. ఐ టి, ఏ ఐ రంగాలతో బాటు ప్రతి ఇంటిలోను ఈ రేడియేషన్ భూతానికి చెక్ పెట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ప్రస్తుతం జి టెల్ - గ్రీన్ ట్రీస్ ఎనర్జీ సంస్థ తెలుగు రాష్ట్రాలలో రేడియేషన్ అవేర్ నెస్ డ్రైవ్ చేపట్టింది. ప్రతి ఇంటిలోను, ఆఫీసు ల్లోను, ఎంత రేడియేషన్ ఉన్నదో రేడియేషన్ డిటెక్టర్లతో మన ఇంటికి వచ్చి మన కళ్ళకి చూపిస్తున్నారు. జి టెల్ సంస్థ ఇంజినీర్లు. ప్రతి ఒక్కరూ మీ ఇంటిలో ఎంత రేడియేషన్ ఉన్నదో తెలుసుకోడానికి ౦91 8885645159 నెంబర్ కి కాల్ చేసి మీ పేరుతో స్లాట్ రిజిస్టర్ చేసుకోండి. రేడియేషన్ నుండి వచ్చే వ్యాధుల నుండి అప్రమత్తం గా ఉండండి. బ్యూటీ పార్లర్లలో నిత్యం ఉపయోగించే హెయిర్ డయర్ లో రేడియేషన్, ఖరీదైన ఫెషియల్ మిషన్ లో రేడియేషన్, హెయిర్ థెరపీ లో రేడియేషన్, పెడిక్యూర్ మిషన్ లో రేడియేషన్. స్టీమ్ లో రేడియేషన్. హెయిర్ ఫాల్ కి, కాన్సర్ లకు అసలైన కారణం ఈ ఎం ఎఫ్ రేడియేషన్. జి టెల్ సంస్థ నుండి మా ఇంజనీర్ లు అనిల్, గౌతమ్, స్వాతి, సుహాని ప్రతి రోజు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు రేడియేషన్ అవేర్నెస్ డ్రైవ్ ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో సేవలు అందిస్తున్నారు. అతి త్వరలో జి టెల్ సంస్థ మహిళల కోసం రేడియేష న్ లేని బ్యూటీ పార్లర్ లను ప్రారంభిస్తున్నామని తిరునగర స్వామి తెలిపారు.

### సేవా దృక్పథంతో రోగులకు

# వైద్య సేవలు అందించాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సేవా దృక్పథంతో రోగులకు వైద్య సేవలు అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రి నిర్వహణ, మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై వైద్య అధికారులు, సిబ్బందితో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసుపత్రి నిర్వహణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వం ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రోగులకు సౌకర్యవంతంగా ఉండేలా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో మంచి మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి బ్లాక్ లో అందుబాటులో ఉండే వివిధ విభాగాల వైద్యుల వివరాలు ఉండే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచిం చారు. చిన్న చిన్న సమస్యలతో రోగులకు అసౌకర్యం కల్పించ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. ఆసుపత్రిలో కావలసిన సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులలో బ్లాక్ ల వారీగా ప్రతి గదికి (సంఖ్య) నంబరింగ్ చేయాలని కలెక్టర్ అధికారు లు సూచించారు. ఆస్పత్రుల్లో గోడల పైన పోస్టర్లను ప్రదర్శిం చకుండా ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారుల సూచించారు. పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న మార్చురీ (శవాల గది) ని విస్తీర్ణం చేసి మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఇఇ ఉమేష్ ను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి కి పూర్తిగా శుభ్రం చేసి వైట్ వాష్ చేయించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలోని పరిసరాలను అదేవిధంగా వివిధ విభాగాల గదులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్తో పాటు వైద్య కళాశాల ప్రిన్సిపల్ మల్లిఖార్జున్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామచందర్ రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, వైద్య అధికారులు ఉన్నారు.

## ప్రేమలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న యువకుడు




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోనీ చిట్టిగిద్ద గ్రామానికి చెందిన సందీప్ (23) ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. కుటుంబికులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మూడు సంవత్సరాలుగా ప్రేమించిన అమ్మాయి నివ్వు నాకు వద్దు చనిపో అని చెప్పడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం పోలంలో చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అమ్మాయి టార్చర్ భరించలేకనే నా కొడుకు చనిపోయాడని కన్నీళ్లు పెట్టుకున్నా మృతుని తల్లి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని, నవాబుపేట్ పోలీసులు ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ఉపాధి హామీ చట్ట రక్షణకై మే 30న జరిగే

# కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** ఉపాధి హామీ చట్టరక్షణకై కూలీల సమస్యల సాధనకై డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మండల పరిధిలోని పులిగిల్ల, కేర్చిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశంలో జరిగిన కూలీల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేదలు,వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య పోరాటం తోపాటు వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పని గ్యారంటీ కోసం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధిస్తే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిధులను క్రమక్రమంగా తగ్గిస్తూ ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు, గత సంవత్సరం 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా 90 వేల కోట్లు ఖర్చు చేసిన పాలకులు ఈ సంవత్సరం 86 వేల కోట్ల రూపాయలకు తగ్గించిందన్నారు దీంతో కూలీల జాబ్ కార్డులు, పని దినాలు పెద్ద ఎత్తున తగ్గించడం జరుగుతుందన్నారు పథకం ప్రారంభంలో 2005 సంవత్సరంలో కూలీలందరికీ పనిముట్లు గడ్డపార పార తట్ట గొడ్డలి లాంటివి ఇస్తామని చెప్పి కేవలం కొద్ది మంది కూలీలకు ఇచ్చి గత పది సంవత్సరాలుగా కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదని అన్నారు పనిచేసే చోట టెంటు మరియు మంచినీళ్లు ఏర్పాటు చేయడం లేదని వారం వారం రావలసిన కూలీ డబ్బులు 5,6 వారాలుగా పెండింగ్ లోనే ఉంటున్నాయని దీంతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ప్రభుత్వం నిర్ణయించిన 307 రూపాయలు ఎవరికి అందని పరిస్థితిలో ఏర్పడ్డాయని కేవలం 150 నుండి 200 కు మించడం లేదని కొలతలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో కూలీలు తమకు ఎంత కూలి చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు ప్రభుత్వం వెంటనే ఈ సమస్యల పరిష్కారం కోసం దిగి వచ్చే విధంగా ఈనెల 30 న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, కెవిపిఎస్ మండల అధ్యక్షులు వేముల అమరేందర్,రైతు సంఘం మండల నాయకులు కొమ్మిడి సత్తిరెడ్డి,కూలీలు చిన్నం అంజమ్మ, అలివేలు, పద్మమ్మ,నరసింహ, అండాలు,యాదయ్య పాల్గొన్నారు.



## హరితహారంతో భవిష్యత్ తరాలకు ఎంతో మేలు

### శంకర్పల్లి మాజీ ఎంపిపి ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి

**శంకర్పల్లి, రాజముద్ర న్యూస్ :** హరితహారంతో భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని శంకర్ పల్లి మాజీ ఎంపిపి ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అయన పిలుపునిచ్చారు. మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా హరితసేన మండల ఇన్చార్జిగా మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం ను నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో మాజీ ఎంపిపితో కలిసి మల్లేశం మొక్కలు నాటారు. అనంతరం మల్లేశం మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, పర్యావరణం దెబ్బ తినడంతో వింత వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలుతాయని, వీటిని అరికట్టాలంటే సమిష్టిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. అంతే కాకుండా విరివిగా వర్షాలు పడి పంటలు కూడా పుష్కలంగా పండుతాయన్నా రు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరూ తమ బాధ్య తగా తీసుకోవాలని అన్నారు. హరితసేన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కు మల్లేశం ధన్యవాదాలు తెలియజేశారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరితసేన మండల ఇన్చార్జిగా నియమించినందుకు కో ఫౌండర్ రాఘవేందర్, సెక్రెటరీ అమృతలాల్, మాజీ ఎంపిపికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్, జాంగిర్ ఖాన్, మహేందర్ రెడ్డి, సంజయ్, ఇంద్రసేనా రెడ్డి, వెంకటరామి రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





## ఈనెల 29న తాండూరులో నిర్వహించిన జాబ్ మేళాలను విజయవంతం చేయాలి

### - వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న తాండూరులో నిర్వహించే జాబ్ మేళాను విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఈనెల 29న తాండూర్ లో నిర్వహించే జాబ్ మేళా పై తాండూరు శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి తో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సదుద్దేశంతో ఉపాధి కల్పన మార్కెటింగ్ మిషన్ (ఇజీఎంఎం) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 52 పారిశ్రామిక రంగాల్లో 11 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 29న తాండూర్ లో నిర్వహించే జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జాబ్ మేళాకు విచ్చేసే నిరుద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. తాండూరు శాసన సభ్యులు బి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో తాండూర్ లోని వినాయక కన్వెన్షన్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు సమాచారాన్ని చేర వేసేందుకు అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ఇలాంటి జాబ్ మేళాల ద్వారా మంచి అవకాశాలు కల్పించే వారమవుతామని ఆయన అన్నారు. జాబ్ మేళాలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా స్టాళ్లను ఏర్పాటు చేసి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఇజీఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్, జెడిఎం సతీష్, తాండూర్ సిడిపిఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

అక్షర రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



## సంక్షేమ సంఘాలతోనే కాలనీ అభివృద్ధి సాధ్యం

**నూతన అధ్యక్షులు మణిరాం నాయక్**

- పంచవటి కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక.
- అధ్యక్షుడిగా మణిరాం నాయక్, కార్యదర్శిగా ఆంజనేయులు.



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పంచవటికాలనీ నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఎన్నుకోవడం జరిగింది. ఓటింగ్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికలలో కాలనీ అధ్యక్షుడిగా భుక్యా మణిరాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా దొండపాటి ఆంజనేయులు విజయం సాధించారు. కోశాధికారిగా రేవనూరి నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా శ్రీశ్రీశ్రీ పంచవటి విగ్నేశ్వర ఆలయ కమిటీ అధ్యక్ష పదవి ఎన్నికలో వంగ శ్రీనివాస్ రెడ్డి, ముక్తేశ్వరరెడ్డిలకు సమానంగా ఓట్లు రావడంతో ఇద్దరికి చేరో ఏడాదిగా నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శిగా ఏటూరి విద్యాధర్ శర్మ, కోశాధికారిగా వాసుదేవ మూర్తిలు గెలుపొందారు. ఈ ఎన్నికల ప్రక్రియను కమిటీ సభ్యులు కె. శంకరచారి, వరకల శ్రీనివాస్, బోటిక శ్రీనివాస్, వేముల సుమేష్ గౌడ్. సేవకుల గీతా, బచ్చు సాగర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... కాలనీ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఎన్నికలలో తమపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ, ఆలయ అభివృద్ధికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి అభివృద్ధికి తోడ్పడతమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తమన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించుకోని సాదారణ సర్వసభ్య సమావేశం నిర్వహస్తామన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలి


**- బిఆర్ఎస్ నాయకులు మురళీధర్ రెడ్డి**



**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలో వరి ధాన్యం కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకనా సాగుతున్నాయని, వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు సురకంటి మురళీధర్ రెడ్డి అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండడంతో వర్షాలు పడి రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నయని,వర్షానికి ధాన్యం తడిసే పరిస్థితి ఏర్పడిందని,రైతులు వాపోతున్నారని. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు.

## క్లాస్‌లు ఎగ్గొట్టినా.. వీసా రద్దు

**విదేశీ విద్యార్థులకు అమెరికా వార్నింగ్**



**న్యూయార్క్:** పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా తాజాగా మరో హెచ్చరిక చేసింది. తమ విద్యా సంస్థల్లో చదివే భారత్ సహా విదేశీ విద్యార్థుల గైర్హాజరు ఆధారంగా కూడా వీసాలను రద్దు చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా ఎంబసీ దీనిపై మం గళవారం ఓ ప్రకటన జారీ చేసింది. "విద్యాసంస్థ నుంచి డ్రాపౌట్ అయినా.. క్లాస్‌లు ఎగ్గొట్టినా.. విద్యాసంస్థకు చెప్ప కుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ స్టూడెంట్ వీసా రద్దవుతుంది. భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసాలకైనా మీరు అర్హత కోల్పోతారు. సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి" అని యూఎస్ ఎంబసీ ఆ ప్రకటనలో వెల్లడించింది. విదేశీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న వారి దగ్గరుంచి.. చిన్న చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారి వీసాలను కూడా రద్దు చేస్తూ స్వదేశాలకు పంపించేస్తున్నారు. వీరిలో కొందరు భారతీయులు కూడా ఉన్నారు. దీనిపై ఆయా విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులకు కూడా ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరికలు జారీ చేసింది. ఓపీటీ ట్రైనింగ్‌ను ప్రారంభించిన 90 రోజుల్లోగా ఉపాధిపై స్టేటస్ తెలియజేయాలని, లేదంటే చట్టబద్ధ హోదాను కోల్పోతారని హెచ్చరించింది. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వెలువడటంతో విదేశీ విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది.

### విదేశాల్లో 18 లక్షల మంది భారతీయ విద్యార్థులు

ఇదిలా ఉండగా విదేశాల్లో భారత విద్యార్థుల సంఖ్య 2025లో 18 లక్షలకు చేరుకుందని భారత విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడించాయి. 2023లో 13లక్షల మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివరకు అమెరికాలోనే ఎక్కువ మంది భారతీయులు చదువుతుండగా.. గత కొంతకాలంగా వీరి సంఖ్య తగ్గుతోంది. ఇప్పుడు కెనడా, యూకేలో చదువుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. గతేడాది అమెరికాలో రికార్డు స్థాయిలో 3,31,602 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. కెనడాలో 1,37,608 మంది, యూకేలో 98,890 మంది చదువుకుంటున్నారు.

## అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి వరి ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, వ్యవసాయం, ఋతుపవన సంసిద్ధత పై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలన్నారు. రుతుపవనాలు ముందుగానే రావడం వల్ల అకాల వర్షాలు కురియడం వల్ల మరి ధాన్యం తడిసే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అదేవిధంగా రైతులకు కూడా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. భూభారతి చట్టమే కాదు ప్రజల చుట్టమని ముఖ్య మంత్రి తెలిపారు. భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వాటికి సంబంధించి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇళ్లను ప్రజలు సందర్శించేలా చూడాలని ఆయన తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్య మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ లు, జిల్లా స్థాయి అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యల పరిష్కారంలో తమ పనితనాన్ని నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వర్షాలు కురిసే సమయంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీఓ వాసు చంద్ర, ఇంచార్జ్ డిసిఎస్ఓ తూక్యా నాయక్, డిఎంసిఎస్ రాము, డిసిఓ నాగార్జున, డిఎంఓ సారంగపాణి హౌసింగ్ పిడి కృష్ణయ్య, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, సిపిఓ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 30న జరిగే కలెక్టర్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయండి

**ప్రభుత్వం కార్మికులకు కర్షకులకు పేదలకు ఇచ్చిన హామీల అమలు చేయాలి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఈనెల 31 తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించినట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు తెలిపారు. ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లును వెంటనే ఇవ్వాలని, భూ సమస్యలు, రేషన్ కార్డు సమస్యలు కరెంటు మంచినీళ్ళ సౌకర్యం మున్సిపల్ పట్టణం లో పెండింగ్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కూలీలకు 8 వారాల పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువైనవి వాటిని సమకూర్చాలన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న భూ సమస్యల పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ మాట్లాడుతూ గ్రామాల్లో కరెంటు, మంచినీళ్లు, రోడ్ల సౌకర్యం, కల్పించాలని పెండింగ్లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని, మున్సిపల్ కేంద్రాల్లో మండల కేంద్రాల్లో పేరుకుపోయిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 30న రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వికారాబాద్ కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు రైతులు కార్మికులు పేదలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, వెంకటయ్య, చంద్రయ్య, సతీష్, శ్రీనివాస్, సుదర్శన్, నవీన్ కుమార్ పాల్గొన్నారు

## సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం

- కాంగ్రెస్ పార్టీ అంటేనే చిల్లర రాజకీయం
- చేవెళ్ల మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ అంటేనే చిల్లర రాజకీయమని, సిరిసిల్ల బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయం పై దాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చేవెళ్ల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. మంగళవారం రోజు అయన మాట్లాడుతూ.. నేషనల్ హెరల్డ్ కేసు, మిస్ వరల్డ్, అవమాన ఘటనలతో ఏమి తోచని స్థితిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజల దృష్టిని మల్లించడానికే సిరిసిల్లలో ఇలాంటి నీ చెప్పు రాజకీయ కుట్రలు కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని అయన దుయ్యబట్టారు. సిరిసిల్లలో మాజీ మంత్రి కెటిఆర్ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడనికి ప్రయత్నించగా, బిఆర్ఎస్ శ్రేణులు దైర్యంగా అడ్డుకుని వారికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. అయితే వారు దాడి చేసిన చర్యను బిఆర్ఎస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై పెద్దోళ్ల ప్రభాకర్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అని చెప్పుకొని గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు రౌడీల పాలన చేస్తు ప్రశాంతంగా ఉన్న నాయకులపై దాడులకు దిగడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చుదాకా ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని నిరంతరం నిలదీస్తామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దొంగ హామీలు ఇచ్చి, గద్దెనెక్కి కూర్చున్న కాంగ్రెస్ ప్రభుత్వం వారి స్వప్రయోజనాలు తప్ప ప్రజల కోసం ఏనాడు ఆలోచించింది లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. దమ్ముంటే ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాలని కానీ, ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం సరి కాదని, మరోసారి ఇలాంటి రాజకీయాలు చేస్తే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి బిఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గడిచిన ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాల దిశగా అడుగులు వేసి, ప్రజలకు మేలు చేసే విధంగా పాలన కొనసాగించాలని హితువు పలికారు.

## గర్భిణుల ఆరోగ్య రక్షణకు "అమ్మ భరోసా"

- ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం ఆరోగ్య దాయకం
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**వలిగొండ రాజముద్ర న్యూస్:** గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ దవాఖాన లల్లో ప్రసవం చేసుకోవడం తల్లి బిడ్డలకు ఆరోగ్యకరమని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.మంగళవారం మండలంలోని సుంకిశాల గ్రామంలోని మంగ భవానీ అనే గర్భిణీ గృహాన్ని అమ్మ భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సందర్శించి గర్భిణీల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గర్భిణీ మంగ భవానీ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకొని ఫౌష్టికాహారం తీసుకోవాలని, సమయపాలనతో భోజనం చేయాలని,మానసిక వత్తిడి లేకుండా చూసుకోవాలని, ఐరన్లో పం లేకుండా ఆకుకూరలు, పండ్లు, పాలు, తృణధాన్యాలు,డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని సూచించి న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో వైద్యాధికారుల బృందం మండలంలోని అరూరు గ్రామ పరిధిలోని అప్పారెడ్డిపల్లిలోని హైరిస్క్ గర్భిణీ రెండవ ప్రసవానికి సిద్ధంగా ఉన్న పాండల ప్రియాంక ఇంటిని సందర్శించి ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేయించుకోవాలని సూచించి ఆరోగ్య జాగ్రత్తలతోపాటు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





**గర్భిణి మంగ భవానిని పలకరించిన కలెక్టర్**


వలిగొండ మండలంలోని సుంకిశాలలో అమ్మ భరోసా కార్యక్రమంలో మంగ భవానీ అనే గర్భిణీ స్త్రీ గృహాన్ని సందర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకొని పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ భవానీని ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స తీసుకుంటున్నావా అని పలకరించగా అవును సార్ అనే సమాధానం ఇచ్చారు. అనంతరం ఆమెకు న్యూట్రిషన్ కిట్టును అందజేశారు.

## అమృత్‌సర్‌లో బాంబు పేలుడు..

**అనుమానిత ఉగ్రవాది మృతి**

**పంజాబ్ :** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. నగర బైపాస్‌కు సమీపంలో ఓ వ్యక్తి బాంబు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా.. అతడి చేతిలోనే అది పేలిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకొని సోదాలు నిర్వహిస్తున్నారు. ఉగ్రకుట్రలో భాగంగా బాంబు పెట్టడానికి ప్రయత్నించారా లేక వేరే ఏదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా ఇటువంటి నిర్జన ప్రదేశాల్లోనే దేశవ్యతిరేక శక్తులు బాంబులను సరఫరా చేస్తుంటాయని అన్నారు. అదే విధంగా బాంబును తీసుకువచ్చిన వ్యక్తి దానిని తప్పుగా ఆపరేట్ చేయడంతో పేలి ఉ ంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

## సిందూర రేఖ ఎంత ముఖ్యమో ప్రపంచానికి తెలిసింది : అమిత్ షా




**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ గురించి కేంద్రహోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. మన తల్లులు, సోదరీ మణుల నుదుటిపై ఉండే ఆ సిందూర రేఖ ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటిచెప్పామని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "సిందూరం ప్రాముఖ్యత ప్రపంచానికి తెలిసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు నిర్వహించి.. దేశం గర్వపడేలా చేశాం. నరేంద్రమోదీకి మాత్రమే అది సాధ్యం. మన దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించాలనుకున్నవారిని వెనక్కి పంపేశాం. వారిప్పుడు బాధతో మూలుగుతున్నారు" అని అమిత్ షా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన రాజకీయ సంకల్పం.. నిఘా సంస్థలు అందించిన కచ్చితమైన సమాచారం.. త్రివిధ దళాల అద్భుత ప్రదర్శన వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందని గతంలో ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని.. వాటిలో 2 ప్రధాన ఉగ్ర కార్యాలయాలు ఉన్నాయని ఇప్పటికే అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, సైనిక స్థావరాలకు గానీ ఎటువంటి నష్టం కలిగించలేదని స్పష్టం చేశారు. కానీ, ఆ దేశ సైన్యం మాత్రం నిషేధిత ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరై.. ఉగ్రవాదానికి మద్దతు పలికారని అన్నారు. వారి చర్యలను ప్రపంచం మొత్తం చూసిందని.. ఉగ్రవాదుల వెనక ఎవరు ఉన్నారనే విషయం అన్ని దేశాలకు అర్థమైనట్లు తెలిపారు. పాకిస్థాన్ టెర్రరిజాన్ని ఓ టూరిజంగా భావిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. "నేను పాకిస్థాన్ ప్రజల్ని ఒక విషయం అడగాలనుకుంటున్నా. మీరు ఏం సాధించారు? నేడు భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. కానీ, మీ పరిస్థితి ఏంటీ? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన వారు మీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఉగ్రవాదం మీ పాలకులు, సైన్యానికి డబ్బు సంపాదించే మార్గం. దానిని అంతం చేసేందుకు పాక్ ప్రజలు ముందుకు రావాలి. సంతోషంగా, ప్రశాంతంగా జీవించండి" అన్నారు.



## సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ(పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా 18 మంది లొంగిపోయారు. వారిలో 10 మందిపై గతంలో మొత్తం రూ.38 లక్షల రివార్డు ప్రకటించారు. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు వీరు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్సల్ రహిత గ్రామ పంచాయతీ పథకం కింద సాధించిన విజయంగా దీన్ని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పెద్దఎత్తున మావోయిస్టులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో వీరు లొంగిపోయినట్లు తెలుస్తోంది.



# ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. గుల్వీర్ సింగ్‌కు స్వర్ణం

గమి (దక్షిణ కొరియా): భారత స్టార్ రన్నర్ గుల్వీర్ సింగ్ ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. పురుషుల 10 వేల మీటర్ల రేసును 28 నిమిషాల 38.63 సెకన్లలో ముగించి ఈ మెడల్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే గుల్వీర్ జాతీయ రికార్డు కూడా నెలకొల్పాడు. ఇక, మెబుకి సుజుకీ (జపాన్) 10 వేల మీటర్ల రేసును 28 నిమిషాల 43.84 సెకన్లతో ముగించి రజత పతకం సాధించాడు. ఆల్బర్ట్ కిబిచి రోప్ (బహ్రెయిన్) 28 నిమిషాల 46.82 సెకన్లతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. గుల్వీర్ సింగ్ మరో పతకం సాధించే అవకాశం కూడా ఉంటుంది. మే 30న జరిగే పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో అతను పాల్గొననున్నాడు. 5 వేల మీటర్ల రేసులో గుల్వీర్‌కు మంచి రికార్డు ఉంది.

### 20 కి.మీ.నడకలో కాంస్యం..

పురుషుల 20 కి.మీ నడకలో సెర్విన్ సెబాస్టియన్ (1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లు) కాంస్యం సాధించాడు. చైనాకు చెందిన వాంగ్ జావోజావో (1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు) స్వర్ణ పతకం అందుకోగా.. జపాన్‌కు చెందిన కెంటో యోషికావా (1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు) రజతం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్‌త్రోలో అన్నురాణి త్రుటిలో కాంస్యం పతకం చేజార్చుకుంది. అన్నురాణి బెస్ట్ త్రో 58.30 మీటర్లు కాగా.. 64 సెంటీమీటర్ల తేడాతో నాలుగో స్థానంలో నిలిచి మెడల్‌ను మిస్ చేసుకుంది. జపాన్‌కు చెందిన సే టకేమోటో (58.94 మీటర్లు) కాంస్య పతకం సాధించింది. సు లింగ్డాన్ (చైనా.. 63.29 మీటర్లు) స్వర్ణం, మోమోన్ ఉడా (జపాన్.. 59.39 మీటర్లు) రజత పతకాలు అందుకున్నారు.

# దంచికొట్టిన జితేశ్ శర్మ

## క్వాలిఫయర్-1కు దూసుకెళ్లిన ఆర్సీబీ



**లఖ్‌నవూ:** ఐపీఎల్-18లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్-1కు దూసుకెళ్లింది. లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత రిషభ్ పంత్ (118: 61 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతకంతో చెలరేగడంతో లఖ్‌నవూ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ జితేశ్ శర్మ (85: 33 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విరాట్ కోహ్లీ (54: 30 బంతుల్లో 10 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (41: 23 బంతుల్లో 5 ఫోర్లు) దంచికొట్టారు. లఖ్‌నవూ బౌలర్లలో విలియమ్ ఒరూర్కే 2, అవేశ్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌తో లీగ్ దశ పూర్తయింది. ఈ నెల 29న క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో బెంగళూరు ఢీకొట్టనుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు దూసుకెళుతుంది. ఓడిన జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది.

### శతకంతో చెలరేగిన పంత్..

ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన చేసిన లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ (118, 61 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) లీగ్ చివరి మ్యాచ్‌లో సెంచరీతో విధ్వంసం సృష్టించాడు. 29 బంతుల్లో అర్ధ శతకం, 54 బంతుల్లో సెంచరీ చేశాడు. మరోవైపు గత మ్యాచ్‌లో శతకం బాదిన మిచెల్ మార్ష్ (67బీ 37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓపెనర్ మాథ్యూ బ్రీట్జ్కే (14) త్వరగానే నిష్క్రమించగా.. మార్ష్, పంత్ రెండో వికెట్‌కు 78 బంతుల్లో 152 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. నికోలస్ పూరన్ (13) పరుగులు చేశాడు. బెంగళూరు బౌలర్లలో నువాన్ తుషార, భువనేశ్వర్ కుమార్, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ పడగొట్టారు.

# ఐపీఎల్ ఫైనల్‌లో 'సిందూర్' స్పెషల్..

## రియల్ హీరోస్‌కు బీసీసీఐ ఆహ్వానం




ఇండియన్ ప్రీమియర్ లీగ్ తుదిదశకు చేరుకుంది. సరిగ్గా వారం రోజుల్లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈసారి తుది పోరు మరింత ప్రత్యేకంగా మారనుంది. ఇందుకోసం బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసిన మన సాయుధ దళాలను ఫైనల్ మ్యాచ్ సందర్భంగా సత్కరించనుంది. ఈ మేరకు వారికి ఆహ్వానాలను పంపించినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ దళాలు ప్రదర్శించిన శౌర్య, పరాక్రమాలు.. దేశ రక్షణ కోసం వారి నిస్వార్థ సేవ ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. అందుకే.. ఐపీఎల్ ముగింపు వేడుకలను మన సాయుధ దళాలను గౌరవించుకునేందుకు అంకితమివ్వాలని నిర్ణయించాం. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి, వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, మిలిటరీ టాప్ ర్యాంక్ అధికారులు, పలువురు జవాన్లను ముగింపు వేడుకకు ఆహ్వానించాం. క్రికెట్ అంటే ఎంతో మందికి ఇష్టమే. కానీ, దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత కంటే ఏదీ ఎక్కువ కాదు" అని సైకియా వెల్లడించారు. జూన్ 3న అహ్మదాబాద్ వేదికగా ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ముగింపు వేడుకల్లో ప్రముఖ గాయకుల ప్రదర్శనలతో పాటు మిలిటరీ బ్యాండ్స్‌తో పరేడ్ కూడా ఉండే అవకాశం ఉండనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి మే 26నే ఐపీఎల్ ఫైనల్ జరగాల్సి ఉండగా.. 'ఆపరేషన్ సిందూర్'తో భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో టోర్నీని వారం రోజుల పాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని మార్పులతో బీసీసీఐ షెడ్యూల్‌ను ప్రకటించింది. భద్రతా కారణాల రీత్యా ఫైనల్ మ్యాచ్ వేదికను కోల్‌కతా నుంచి అహ్మదాబాద్‌కు మార్చింది.



## కెప్టెన్సీ విషయంలో గిల్ కన్నా..

# పంత్‌కే నా ఓటు

### : వీరేంద్ర సెహ్వాగ్

టెస్ట్ కెరీర్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికిన అనంతరం ఆ బాధ్యతలు శుభ్‌మన్ గిల్‌కు దక్కాయి. రిషభ్ పంత్‌ను వైస్‌కెప్టెన్‌గా సెలెక్టర్లు ఎంపిక చేశారు. జూన్ 20 నుంచి టీమ్‌ఇండియా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా ఐదు టెస్టుమ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీకి ఇది పరీక్షే. నిజానికి జస్ప్రీత్ బుమ్రానే సారథి పదవి వరించేది. కానీ, ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ వంటి కారణాలతో సెలక్టర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌ను కాదని శుభ్‌మన్ గిల్ వైపు మొగ్గుచూపారని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు. దీనిపై భారతజట్టు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ మాత్రం దీనిపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేశాడు. 'కెప్టెన్సీకి గిల్ సెకండ్ బెస్ట్ ఆప్షన్. ఫిట్‌నెస్ సమస్యల వల్ల తుదిజట్టులో ఆడలేని వారికి సారథ్య బాధ్యతలు ఎలా అప్పగిస్తారు. అందుకే సెలెక్టర్లు గిల్‌ను కెప్టెన్‌గా నియమించారు' అని మనోజ్ తివారీ విశ్లేషించాడు. ఈ వ్యాఖ్యలను వీరేంద్ర సెహ్వాగ్(%ఎఅతీవఅఅవతీ గావష్ట్ఝుస్త్ర%) సమర్థిస్తూనే... కెప్టెన్సీ విషయంలో మాత్రం తన ఓటు రిషభ్‌పంత్‌కే అన్నాడు. 'ఈ ఒక్క సిరీస్ కోసం అయితే బుమ్రాను కెప్టెన్‌గా నియమించొచ్చు. దీంతో ఏ ఇబ్బందీ లేదు. కానీ, దీర్ఘకాలానికి సంబంధించి మాత్రం ఈ నిర్ణయం సరైంది కాదు. ఎందుకంటే భారతజట్టు ఓ సంవత్సరంలో పది టెస్టు మ్యాచ్‌లు ఆడుతుందనుకుంటే.. అతడు అన్ని మ్యాచ్‌లకూ అందుబాటులో ఉండలేడు. ఈ నేపథ్యంలో బుమ్రాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వకపోవడం సరైనదే. గిల్‌కు కెప్టెన్సీ అప్పగించిన విషయంలో మనోజ్ తివారీ అభిప్రాయంతో నేను ఏకీభవించను. నా దృష్టిలో టీమ్‌ఇండియాకు సారథిగా రిషభ్ పంత్ సెకండ్ బెస్ట్ ఆప్షన్. గిల్ మూడో ఆప్షన్' అని వీరేంద్ర సెహ్వాగ్ కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని చెప్పాడు. అలాగే.. రిషభ్ పంత్‌కు తాను ఎందుకు మద్దతు ఇస్తున్నాడో వివరించాడు. 'టెస్ట్ క్రికెట్‌కు పంత్ చేసినంతగా, ఇతర ఆటగాళ్లెవరూ చేయలేదు. క్రికెట్ అభిమానులను టెస్ట్ మ్యాచ్‌లు చూసేలా కట్టిపడేసింది విరాట్. అతడి తర్వాత ఈ పని చేసింది కేవలం పంత్ మాత్రమే. యాక్సిడెంట్ తర్వాత అతడు జట్టులోకి పునరాగమనం చేశాడు. ఆ ప్రమాదపు ఛాయలు తన ఆటపై పడకుండా శ్రమించాడు. ఇప్పుడేమో ఏకంగా టీమ్‌ఇండియాకు టెస్ట్ ఫార్మాట్లో వైస్ కెప్టెన్ అయ్యాడు. పడిలేచిన కెరటంలా తిరిగొచ్చాడు. అందుకే సెలెక్టర్లు భవిష్యత్తులో అయినా పంత్‌కు కెప్టెన్‌గా పగ్గాలు అప్పగించాలి. చాలా కొద్ది మంది బౌలర్లు మాత్రమే టీమ్‌ఇండియాకు సారథిగా వ్యవహరించారు. నేను క్రికెట్ ఆడిన కాలంలో కేవలం అనిల్‌కుంబ్లేనే ఆ ఘనత సాధించాడు. అలాగే అతడు ప్రతి మ్యాచ్‌కూ అందుబాటులో ఉన్నాడు' అని సెహ్వాగ్ ముగించాడు.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేరు మార్పు.. ఇక ఓన్లీ ఇన్‌స్టామార్ట్




**దిల్లీ:** స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్ పేరు మారింది. ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన ఈ క్విక్ కామర్స్ సంస్థ తనకంటూ ప్రత్యేక బ్రాండ్‌గా గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తన మాతృ సంస్థ స్విగ్గీ పేరును తొలగించింది. మరో ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో ఇప్పటికే ఎటర్నల్‌గా పేరు మార్చుకున్న సంగతి తెలిసిందే. బ్లింకిట్ పేరిట క్విక్ కామర్స్‌ను, జొమాటో పేరుతో ఫుడ్ డెలివరీ సేవలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో స్విగ్గీ నుంచి ఈ నిర్ణయం వెలువడింది. తమ ఫుడ్ డెలివరీ వ్యాపారాన్ని ఇన్‌స్టామార్ట్ ఎప్పటికైనా అధిగమిస్తుందని స్విగ్గీ గ్రూప్ సీఈఓ శ్రీహర్ష మజేటి పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇన్‌స్టామార్ట్‌కంటూ ప్రత్యేక బ్రాండ్‌గా గుర్తింపు తీసుకురావాలని ఆ కంపెనీ భావిస్తోంది. తొలుత తమ యాప్‌లోనే ఇన్‌స్టామార్ట్ బటన్‌ను ప్రత్యేకంగా అందించిన స్విగ్గీ.. తర్వాత ఇన్‌స్టామార్ట్ కోసం ప్రత్యేకంగా స్టాండలోన్ యాప్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తాజా మార్పులో భాగంగా ఇన్‌స్టామార్ట్ కొత్త లోగోను ఆవిష్కరించింది. పేరులో స్విగ్గీని తొలగించినప్పటికీ.. స్విగ్గీ ఎస్-పిన్ ఐకాన్‌ను మాత్రం కొనసాగించింది. విజువల్‌గానే ఈ మార్పు అని.. తర్వాత స్విగ్గీ నమ్మకం అలానే కొనసాగుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. యాప్‌లో లోగోను మార్చిన ఆ కంపెనీ.. ప్యాకింగ్, డెలివరీ బ్యాగ్, కమ్యూనికేషన్, క్యాంపెయిన్ వంటి విషయాల్లో త్వరలో ఈ మార్పు కనిపిస్తుందని చెప్పింది.

# భారీ నష్టాల్లో సూచీలు..

## 24,850 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మన సూచీలు తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభనష్టాల మధ్య చలించింది. ముఖ్యంగా ఆటో, ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో సూచీల రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ మళ్లీ 24,850 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,038.20 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,176.45) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే భారీ నష్టాల్లోకి జారుకుంది. కొద్దిసేపటికి లాభాల్లోకి వచ్చిన సూచీ 82,410.52 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మదుపర్లు ఆనందపడే లోపే మళ్లీ నష్టాల్లోకి వెళ్లిన సూచీ.. ఇంట్రాడేలో 81,121 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 624 పాయింట్ల నష్టంతో 81,551.63 వద్ద స్థిరపడిం ది. నిఫ్టీ 174.95 పాయింట్ల నష్టంతో 24,826.20 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 పైసలు క్షీణించి 85.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3294 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# జియో ఫైనాన్షియల్ మ్యూచువల్ ఫండ్‌కు సెబీ ఆమోదం




**దిల్లీ:** దేశంలో మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు తమ అనుబంధ సంస్థకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతి లభించిందని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ మంగళవారం వెల్లడించింది. జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పేరిట సేవలందించేందుకు అనుమతిచ్చింది. ఈ మేరకు సర్టిఫికేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను జారీ చేస్తున్నట్లు జియో బ్లాక్ రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ కంపెనీకి మే 26 సెబీ లేఖ రాసినట్లు జేఎస్ఎఫ్ఎల్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. జియో ఫైనాన్షియల్, అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్ కలిసి జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, జియో బ్లాక్‌రాక్ ట్రస్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. తలో 50 శాతం వాటాతో ఈ జేవీని ఏర్పాటు చేశాయి. ఇరు సంస్థలు కలిసి మ్యూచువల్ ఫండ్ కంపెనీలో రూ.117 కోట్లు పెట్టుబడిగా పెడుతున్నట్లు జియో ఫైనాన్స్ ఈ ఏడాది జనవరిలో వెల్లడించింది. 2023 అక్టోబర్‌లోనే మ్యూచువల్ ఫండ్స్ బిజినెస్ నిర్వహణకు అనుమతి కోరుతూ జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ కంపెనీ దరఖాస్తు చేశాయి. తాజాగా అనుమతులు లభించడంతో మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించడానికి మార్గం సుగమం అయ్యింది.

# భారీ నష్టాల్లో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్లు.. బోరానా వేవ్స్ ఎంట్రీ




విద్యుత్తు బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్లు నేడు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో వీటి విలువ ఏకంగా 14 శాతం క్షీణించి రూ.1,160 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి కంపెనీకి వచ్చిన ఆర్డరు రద్దైన నేపథ్యంలో షేర్లపై ఒత్తిడి పెరిగింది. మార్కెట్ ప్రారంభంలో పెద్ద ఎత్తున నష్టపోయిన ఈ షేర్లు ప్రస్తుతం కాస్త కోలుకున్నాయి. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్లు 6.42 శాతం నష్టంతో రూ.1,259 వద్ద ట్రేడవుతున్నాయి. కంపెనీకి ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేసుకుంటున్నట్లు మహారాష్ట్ర రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. మే 22 నాటికి కంపెనీ 1000 బస్సులను డెలివరీ చేయాల్సి ఉండగా.. ఒక్కటి కూడా అందించలేదన్నారు. అయితే ఆయన తన పోస్ట్‌లో కంపెనీ పేరు ప్రస్తావించలేదు. అధికారుల సూచన మేరకు 5,150 ఎలక్ట్రిక్ బస్సుల కోసం గతంలో ఇచ్చిన టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


### నష్టాల్లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు

ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో 3.4 శాతం వాటాను ప్రమోటర్ రాకేశ్ గంగ్వాల్, అతని కుటుంబ ట్రస్ట్ రూ.6,831 కోట్లకు విక్రయించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాని షేర్లు క్షీణిస్తున్నాయి. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో 2 శాతం నష్టంతో రూ.5,310 వద్ద ట్రేడవుతున్నాయి. అయితే, వాటా విక్రయాలకు సంబంధించి సంస్థ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.

### బోరానా వేవ్స్ ఎంట్రీ

గుజరాత్‌లోని ప్రముఖ టెక్స్‌టైల్ తయారీ సంస్థ బోరానా వీవ్స్ షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. 12.5 శాతం ప్రీమియంతో మార్కెట్లోకి అరంగేట్రం చేశాయి. ఇష్యూ ధర రూ.216తో పోలిస్తే ఎన్ఎస్ఈలో రూ.243 వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. లిస్టింగ్ తర్వాత షేర్లు రాణిస్తున్నాయి. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఎన్ఎస్ఈలో 18.13 శాతం లాభంతో రూ.255 వద్ద ట్రేడవుతున్నాయి.

# క్విక్ కామర్స్, ఫిన్‌టెక్‌పై ఫోకస్..




వాల్‌మార్ట్‌కు చెందిన ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టనుంది. ఈ ఏడాది 5,000 మందిని నియమించుకొనేం దుకు సిద్ధమవుతోంది. క్విక్ కామర్స్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తరణపై దృష్టి సారించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా కంపెనీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్లిప్‌కార్ట్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సీమా నాయర్ ఈ నియామక ప్రణాళికలను ప్రకటించారు. 'మినిట్స్' పేరిట క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న ఫ్లిప్‌కార్ట్ తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తోంది. దీని ద్వారా వినియోగదారులకు వేగవంతమైన డెలివరీ సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ పేమెంట్స్ జరిపేందుకు సూపర్.మనీ పేరుతో తీసుకొచ్చిన అప్లికేషన్‌పై దృష్టి సారించింది. ఈ విభాగాల్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నూతన నియామకాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఈ చర్య కంపెనీ అభివృద్ధికి దోహదం చేస్తుందని భావిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ సంస్థ భారత మార్కెట్లో తన స్థానాన్ని బలోపేతం చేసుకొనేందుకు వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తోంది. ఫ్యాషన్ రంగంలోనూ తన సత్తా చాటుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనూ దూకుడుగా పెట్టుబడుల్ని పెడుతోంది. ఈ ఏడాదిలో ఏఐపై పెట్టుబడులు ఆరు రెట్లు పెరిగాయి. మరోవైపు పబ్లిక్ ఇష్యూ కోసం సిద్ధమవుతున్న ఫ్లిప్‌కార్ట్ తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించాలని భావిస్తోంది.

# థియేటర్లలో ధరల నియంత్రణకు చర్యలు

- బంద్ వెనుక శక్తులేమిటో విచారించాలి
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో సినిమాహాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తాజాగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.. సినిమాలు హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.

### 'హరిహర వీరమల్లు'కు అలాగే చేయండి

కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. టికెట్ ధరల పెంపు, సినిమా హాళ్ల నిర్వహణ సహా ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలని ఇందులో ఎలాంటి బేధాలు పాటించవద్దు అని స్పష్టంగా చెప్పారు.

### తినుబండారాల ధరలపై విచారణ చేపట్టండి

టికెట్ ధర కంటే సినిమా హాల్లో పాప్‌కార్న్ సహా ఇతర తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాటి వాస్తవ ధరలు.. ప్రస్తుతం ఎంతకు విక్రయిస్తున్నారు.. అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోనూ గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం మెరుగవుతుందన్నారు. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు.

### జనసేన వాళ్లు ఉన్నా వదలొద్దు

తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటన వెలువడటానికి నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం.. తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని, ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందని, విచారణ చేయించాలని మంత్రి దుర్గేష్‌కు పవన్ కల్యాణ్ సూచించారు.

### బెదిరింపు ధోరణి పనికిరాదు

సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ ప్రకటన వెనకగల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన వాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దన్నారు. నిర్మాతలు, నటులు, దర్శకులు బెదిరింపుల ద్వారా వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వొద్దన్నారు. సినిమా వ్యాపారం సజావుగా సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకు వస్తుందన్న విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకురానున్న సినీ పరిశ్రమ సమగ్రాభివృద్ధి పాలసీ కోసం తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# పుష్ప పాత్రను మిస్ చేసుకున్నా: నారా రోహిత్



నారా రోహిత్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామమూర్తి నాయుడు కుమారుడైన రోహిత్ సినిమాల మీద ఆసక్తితో ఎప్పుడో బాణం అనే సినిమాతో హీరోగా లాంచ్ అయ్యాడు. ఆ తర్వాత చేసిన సోలో ఇలాంటి సినిమా ఆయనకు మంచి హిట్ వచ్చింది. ఆ తర్వాత చేస్తున్న సినిమాలన్నీ వైవిధ్యంగా ఉన్నా ఎందుకో హిట్స్ అందుకోలేకపోయాడు. అయితే ఆయన తాజాగా భైరవం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో ఆయన మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. మే 30వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో నారా రోహిత్ మీడియాతో ముచ్చటించాడు. ఈ సందర్భంగా అనేక విషయాలు పంచుకున్న ఆయన తాను పుష్ప లాంటి సినిమాను మిస్ చేసుకున్నట్లు- వెల్లడించాడు. తనను పుష్ప సినిమాలోని ఫహద్ ఫాజిల్ క్యారెక్టర్ కోసం ముందు అడిగారని, అయితే మాటలు జరుగుతున్న సమయంలోనే ఆ సినిమాను పాన్ ఇండియా సినిమాగా చేయాలని భావించి ఆ సమయంలో ఫహద్ ఫాజిల్‌ను సంప్రదించారని చెప్పుకొచ్చాడు. ఇక భైరవం సినిమా బాగా కుదిరిందని, తమిళంలో శశి కుమార్ చేసిన పాత్ర తాను ఇక్కడ పోషించానని చెప్పుకొచ్చాడు. కచ్చితంగా భైరవం హిట్ అవుతుందని నమ్మకం ఆయన వ్యక్తం చేశాడు. అలాగే తాను సుందరకాండ అనే సినిమాతో మరో నెల రోజుల్లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు- వెల్లడించాడు.



# 'ఈ నెలను మే అని ఎందుకు పిలుస్తారో ఇప్పుడే అర్థమైంది' : శ్రీలీల

కెరీర్ ప్రారంభంలోనే వరుస హిట్లతో ఫుల్ జోష్ మీద దూసుకుపోయింది కుర్ర హీరోయిన్ శ్రీలీల. ఈ బ్యూటీ మొదట్లో చిన్న చిన్న హీరోల సరసన నటించింది. వెంటనే ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ సరసన అవకాశం కొట్టేసింది. ఇక ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ కొట్టడంతో వరుస అవకాశాలు దక్కాయి. ఈ అమ్మడు అందం, అభినయం, నటనతో తెలుగు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. ఇరగదీసే డ్యాన్స్‌తో కుర్రాళ్లకు చెమటలు పట్టించిందనడంలో అతిశయోక్తిలేదు. కాగా శ్రీలీలను తమ సినిమాల్లో పెట్టుకునేందుకు పోటీపడ్డారు. తెలుగులో మొదట్లోనే వరుస సినిమాలతో టాలీవుడ్ షేక్ చేసింది. సీనియర్ హీరోయిన్లకు సైతం చెమటలు పట్టించింది. ఇకపోతే శ్రీలీల తరచూ సోషల్ మీడియాలో ఏదో ఒక పోస్ట్ పెడుతూ.. నెటిజన్లను ఆకట్టుకుంటుందన్న విషయం తెలిసిందే. ఫ్యామిలీ, ఫ్రెండ్స్, వృత్తిపర విషయాలు ఇలా ప్రతిదీ శ్రీలీల సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటూ వారికి టచ్‌లో ఉంటుంది. అయితే తాజాగా ఈ కుర్ర హీరోయిన్ నెట్టింట ఓ పోస్ట్ పెట్టింది. కొన్ని ఆకట్టుకునే పిక్స్ షేర్ చేసి.. "ఈ నెలను మే అని ఎందుకు పిలుస్తారో ఇప్పుడే అర్థమైంది. వర్షం పడవచ్చు.. వేడిగా ఉండకపోవచ్చు .. నిజాయితీగా చెప్పాలంటే ఎందుకు కాదు" అంటూ క్రేజీ క్యాప్షన్ కూడా జోడించింది.



# నాకెందుకు ఈ పరీక్ష స్వామీ..

## మంచు విష్ణు పోస్ట్ వైరల్

మంచు విష్ణు కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 27 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో మరో సమస్య 'కన్నప్ప'ను చుట్టుముట్టింది. ఈ మూవీలో కీలక సన్నివేశాలకు సంబంధించిన హార్డ్‌డ్రైవ్‌ను అనుమతి లేకుండా బయటకు తీసుకెళ్లడం సర్వత్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే మూవీ ప్రచార కార్యక్రమంలో తీరిక లేకుండా గడుపుతున్న మంచు విష్ణుకు ఈ సమస్య కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది. దీంతో ఆ పరమ శివుడిని ప్రశ్నిస్తూ మంచు విష్ణు పోస్ట్ పెట్టారు. 'జటాజూటధారీ, నీకోసం తపస్సు చేసే నాకెందుకు ఈ పరీక్ష స్వామీ?' చహరహరమహాదేవ్ అంటూ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంచు విష్ణుకు ఎదురైన పరిస్థితి చూసి, ఆయన అభిమానులు ఎక్స్ వేదికగా ధైర్యం చెబుతున్నారు. కోకాపేటకు చెందిన రెడ్డి విజయ్‌కుమార్ ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. కన్నప్ప చిత్రానికి కీలకమైన కంటెంట్ ఉన్న హార్డ్‌డ్రైవ్‌ను ముంబయిలోని హెచ్‌ఐవీఈ స్టూడియోస్ వారు డీటీడీసీ కొరియర్ ద్వారా ఫిల్మ్‌నగర్‌లోని విజయ్‌కుమార్ కార్యాలయానికి పంపారు. ఈ పార్శిల్‌ను ఈ నెల 25న ఆఫీస్‌బాయ్ రఘు తీసుకున్నాడు. అతను ఈ విషయం ఎవరికీ చెప్పకుండా హార్డ్‌డ్రైవ్‌ను చరిత అనే మహిళకు అప్పగించాడు. అప్పటి నుంచి వారు తప్పించుకుని తిరుగుతున్నారు. తమ ప్రాజెక్టుకు నష్టం కలిగించాలనే దురుద్దేశంతో రఘు, చరితలు కలిసి ఇలా చేస్తున్నారని విజయ్‌కుమార్ ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హార్డ్ డిస్క్‌లో 1.30 గంటల సినిమా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖ్యంగా ప్రభాస్‌కు సంబంధించిన కీలక యాక్షన్ సీక్వెన్స్ హార్డ్‌డ్రైవ్‌లో ఉన్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.

# షష్టిపూర్తి ఓ ఫ్యామిలీ డ్రామా

## దర్శకుడు పవన్ ప్రభ వెల్లడి




డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు పవన్ ప్రభ మూవీ విశేషాలను మీడియాకు వివరించారు. షష్టిపూర్తి' గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా గారు కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా గారు ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండేవారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు- అడ్జస్ట్ అవ్వాలి. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే 'షష్టిపూర్తి'ని తీశాను. షష్టిపూర్తి' విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్ గారు, అర్చన గారిని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ- ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్ట్రిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవియల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్ గారిని చూపించాను. పాటల సిట్యువేషన్‌ను తీసేసి కథను చెప్పమని ఇళయరాజా గారు అన్నారు. ఎక్కడ పాట రావాలో నేను చెబుతాను అని ఆయనే చెప్పారు. ఇక ఫస్ట్ కంపోజిషన్ కోసం మళ్లీ వెళ్లాం. సిట్యువేషన్ చెప్పిన వెంటనే హార్మోనియం మీద పల్లవి ప్లే చేసి వినిపించారు. 'ఇది సరిపోతుందా? మీరు ఆశించినట్టుగా ఉందా? ఇంకా ఏమైనా –చేద్దామా?' అని ఇళయరాజా గారు అన్నారు. ప్రతీ పాటకు మాకు ఎన్నో ఆప్షన్స్ ఇచ్చారు. అన్ని పాటల్ని క్షణాల్లో కంపోజ్ చేసి ఇచ్చారు. చైతన్య ప్రసాద్ , రెహమాన్ , కీరవాణి ఈ చిత్రానికి మంచి పాటలు రాశారు. రూపేశ్, ఆకాంక్ష ఇద్దరూ అద్భుతంగా నటించారు. రూపేశ్ కారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉంటాయి. ఆకాంక్ష అచ్చమైన తెలుగమ్మాయి పాత్రలో కనిపిస్తారు. ఆమె పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తరువాత ఆమెకు మరింత మంచి భవిష్యత్తు ఉంటుంది. 'షష్టిపూర్తి' అనేది పూర్తిగా కల్పిత చిత్రమే. ఇందులో ఉండే పాత్రల్లా బయట బతకలేరు. రాజేంద్ర ప్రసాద్ గారు పోషించిన పాత్ర బయట కనిపించదు. ఇలాంటి కథను నమ్మి పెట్టుబడి పెట్టడం అంటే మామూలు విషయం కాదు. మనం కథను చెప్పేటప్పుడు.. మనం ఏం ఫీల్ అవుతామో.. అవతల ఉన్న నిర్మాత కూడా అదే ఫీల్ అయితే సినిమా ముందుకు వస్తుంది. ఇలాంటి చిత్రాల్ని డైరెక్ట్ చేయడం కంటే ప్రొడ్యూస్ చేయడం కష్టం. మంచి ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా మా 'షష్టిపూర్తి' రాబోతోంది. కొన్ని రోజుల పాటు- ఈ చిత్రం అందరినీ వెంటాడుతూ ఉంటుంది. నా చిత్రం పెరుగన్నం లాంటిది. సెన్సార్ వాళ్లు మా చిత్రానికి ఒక్క కట్ కూడా చెప్పలేదు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com